

పొట్టినవలల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన నవల




లేడీ డాక్టర్ చేతికున్న గ్లవుస్ తీస్తూ బయటికి వచ్చింది.

ఆమె వెనకే సముద్ర కూడా బయటికి వచ్చింది. వాళ్ళిద్దరూ రావడం చూసి డాక్టర్ ఏం చెప్తుందా అని కుతూహలంగా చూశాడు ఆకాశ్.



"కంగ్రాట్స్ మీరు తండ్రి కాబోతున్నారు" అంది డాక్టర్ తన కుర్చీలో కూర్చుంటూ...

ఇలాంటి షాట్ తీసేటప్పుడు సినిమా వాళ్ళు బ్రహ్మాండంగా తీస్తారు. హీరో హీరోయిన్ వైపు మెరిసే కళ్ళతో చూస్తాడు. హీరోయిన్ కళ్ళు సిగ్గుగా వాలిపోతాయి.

''డాక్టరుగారూ మా ఆవిడ విషయంలో నేను తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో చెప్పండి! మంచంమీంచి కాలు కిందపెట్టనివ్వననుకోండి. వంట మనిషిని పెడతాననుకోండి. మందులు, పండ్ల రసాలు జాగ్రత్తగా ఇస్తాను లెండి. అయినా ఇంకా ఏమైనా ఉంటే చెప్పండి నాకు తెలియదు కదా!'' అంటాడు హీరో.

డాక్టర్ ఏవో జాగ్రత్తలు చెప్తుంది.

ఆ తర్వాత హీరో హీరోయిన్ని రెండు చేతుల్తోనూ ఎత్తేసి గిరగిరా తిప్పేస్తాడు. (ఈ మధ్య వచ్చే సినిమాల్లో అయితే ముద్దుల వర్షం కూడా కురిపించేస్తున్నాడు హీరో)

ఆ తర్వాత పాట.

'అమ్మాయే పుడుతుంది అచ్చం అమ్మలాగే ఉంటుంది' అని హీరో, 'అబ్బాయే పుడతాడు అచ్చం నాన్నలాగే ఉంటాడు అని హీరోయిన్.

కానీ సముద్ర, ఆకాశ్‌ల విషయంలో అలా జరగలేదు.

ఇద్దరూ ఒకరివైపొకరు క్షణకాలం పరీక్షగా చూసుకున్నారు.

తర్వాత ఆకాశ్ భార్యవైపు చెప్పమన్నట్లు చూశాడు.

సముద్రకి కోపం వచ్చింది.

'తనే చెప్పొచ్చు కదా! పనిలోకెళ్తూ పిల్లిని చంకన బెట్టుకున్నట్లుగా ఇతన్ని తేవడం ఎందుకు ఆ మాత్రం చెప్పకపోతే' అనుకుంది చికాగ్గా.

గొంతును సాధ్యమైనంత తగ్గించి అంది.

''అబార్షన్‌కి అవకాశం లేదంటారా?'' అని.

చివ్వున తలెత్తి చూసింది డాక్టర్.

''మీకు ఆరోగ్యంగా బతకాలని లేదంటారా? చెప్పండి! అలా అంటే తప్పకుండా చేసేస్తాను''

''అది కాదండీ!''

''ఏది కాదమ్మా మీ పెళ్ళయిన నాలుగేళ్ళలో రెండు అబార్షన్లు చేయించారు. ఇంకా ఎన్ని చేయించుకుంటారు!''

''పరిస్థితి అలాంటిది డాక్టర్! ఇప్పుడు ప్రెగ్నెన్సీ, డెలివరీ ఆ తర్వాత చంటిపిల్లాడూ వీటితో కొన్నేళ్ళు హుష్‌కాకీగా గడిచిపోతాయి. నా కెరియర్ పాడవుతుంది''

''కానీ ఇంకా ఆలస్యం చేస్తే మీకూ కష్టమే. ముప్పైఏళ్ళు దాటాక వచ్చే కాన్పు కష్టంగా ఉంటుందని, అసలా వయసులో ప్రెగ్నెన్సీ రావడమే మామూలుకంటే తగ్గుతుందని మీకు నేను చెప్పక్కర్లేదనుకుంటాను''

''అవుననుకోండీ...''

''ఈ ఒక్కసారికీ కనేసేయండి. మీ హెల్త్‌ని కూడా పాడు చేసుకోనక్కరలేదు ఆ పని చేస్తే...''

భార్యాభర్తలిద్దరూ ఇటూ చెప్పలేదు, అటూ చెప్పలేదు. మౌనంగా తిరుగుము ం పట్టారు.

ఇంటిముందు స్కూటర్ ఆపాడు ఆకాశ్.

సముద్ర విసవిసా వచ్చి పెద్ద శబ్దం చేస్తూ గేట్ తీసింది.

హాండ్‌బాగ్‌లోంచి తాళం చెవి తీసి తలుపుకున్న తాళం తీసింది.

తలుపుని ధన్‌మని తోసింది.

బాగ్‌ని కుర్చీలోకి విసిరికొట్టింది.

చెప్పులని విసిరేసినట్లుగా వదిలేసింది.

మూసివున్న కిటికీలను భళ్ళు భళ్ళుమని చప్పుడు చేస్తూ తీసింది. వాటికున్న కర్టెన్లని, విసురుగా పక్కకి జరిపింది.

అప్పటికి స్కూటర్ గ్రౌండ్‌లో పార్కు చేసి గేటేసి లోపలికి వచ్చాడు ఆకాశ్.

"నీవల్లే జరిగిందంతా!" గట్టిగా అరిచింది.

"నా వల్లా!"

"అక్షరాలా నీవల్లే. కేర్ తీసుకోవయ్యా నా హెల్త్ పాడవుతుంది అని నేను నెత్తీనోరూ మొత్తుకుని చెప్తూ వచ్చినా శాటిస్‌ఫాక్షన్ ఉండదు అంటూ నెగ్లెక్ట్ చేస్తూ వచ్చావు"


"ఏం. నువ్వు మాత్రం టాబ్లెట్లు వేసుకోలేవు!"

"దానివల్ల నా హెల్త్ పాడవ్వడం పెళ్ళయిన కొత్తల్లోనే చూసావుకదా!"

"జరిగిందేదో జరిగిపోయింది. వేరే డాక్టర్ దగ్గరికెళ్దాం పద!"

"వాడ్డూయూ మీన్ బైదట్!"

"ఏముంది? కాస్త డబ్బెక్కువ ముట్టచెప్తే చుప్‌చాప్‌గా చేసేసే డాక్టర్లు కోకొల్లలున్నారు అంటున్నాను"



''వాళ్ళు చేస్తారు సరే! అందువల్ల నా ఆరోగ్యం పాడైతే నీకేం బాధలేదన్నమాట''

''అది కాదు సముద్రా...''

''ఏది కాదు? నీ సంగతి నాకు బాగా తెల్సు. నేను చచ్చినా నీకేం నష్టం లేదు లాభమే తప్ప. ఎర్రిగా బుర్రిగా ఉంటావు. మంచి ఉద్యోగం వెలగబెడ్తున్నావు. పైనా కిందా కూడా సంపాదిస్తున్నావు. ఆఫ్టరాల్ ఓ పెళ్ళాం చస్తే ఏం ఇన్ని క్వాలిఫికేషన్లుండగా!

నా పాడె లేచేలోగానే పెళ్ళికూతుళ్ళ తండ్రులు క్యూలు కట్టేస్తారు ఈ ఇంటిముందు.

అప్పుడు నువ్వు రెండో పెళ్ళి అని కూడా ఆలోచించకుండా ఓ రేట్లో గిరి గీసుకుని కూర్చుంటావు''

''ఇంక ఆపు సముద్రా బోర్‌గా ఉంది''

''మరైతే అలా మాట్లాడ్తావేం?''

''ఓకే! ఇంక అలా మాట్లాడను. ఇదిగో చెంపలేసుకుంటున్నాను. మరైతే దీనికి సొల్యూషన్ ఏమిటో నువ్వే చెప్పు''

''మీ అమ్మ మనకి పిల్లో పిల్లాడో పుట్టినప్పటినుండీ ఇక్కడే ఉండాలి. అందుకని ఆవిడని రమ్మని ఇప్పట్నుండే రాస్తూ వస్తావో లేకపోతే అప్పుడే వెళ్ళి తీసుకువస్తావో నీ ఇష్టం''

''మా అమ్మ ఎలా వస్తుంది సముద్రా?''

''ఎందుకు రాలేదుట పాపం?''

''ఉమ్మడి కుటుంబంలోకి అడుగుపెడుతూనే నన్ను అమ్మా నాన్నలకి దూరం చేసే దాకా ఊరుకోని ఉత్తమురాలివి కదా నువ్వు. అలాంటి కోడలి దగ్గరికి వచ్చి సాయం చెయ్యడానికి ఆవిడ మనసు ఒప్పుతుందా?''

''బాగుంది! ఇందులో అంత బాధపడిపోవడానికి ఏముంది? చదువుకున్న ఏ ఆడపిల్లనైనా అడిగి చూడు. అత్తగారింట్లో ఆవిడ మోచేతి కింద నీళ్ళు తాగుతూ పడి ఉండటానికి ఒప్పుకుంటుందేమో! వేరే ఎవరిదాకానో ఎందుకు పెళ్ళి కావాల్సిన నీ చెల్లెళ్ళనే అడుగు ఒప్పుకుంటారేమో!''

''అదికాదు సముద్రా. పెళ్ళి కావాల్సిన చెల్లెళ్ళని తమ్ముడిమీద వదిలేసి అమ్మ అంతకాలం మన దగ్గర ఎలా ఉండగలుగుతుంది చెప్పు. అదే మీ అమ్మయితే హాయిగా ఉండొచ్చు. ఆవిడకి బాధ్యతలేవీ లేవాయే!''

''మా నాన్నని ఆ వయసులో అలా ఒంటరిగా వదిలేసి రావడం ఏమైనా న్యాయమా?''

''మరేం చేద్దాం''

''నేను ఉద్యోగం మానేస్తాను. నా కెరియర్‌కి ఎలాగూ బ్రేక్ పడక తప్పదు కదా!''

''కానీ అలా అయితే మనకి ఎడ్జస్ట్ కావడం చాలా కష్టం. పైగా చంటి పిల్లాడంటే ఎంత

ఖర్చు!''

ఎంతసేపు ఆలోచించినా ఇద్దరికీ సరైన పరిష్కారమేదీ దొరకలేదు. చంటిపిల్లల్ని చూసే సంక్షేమ కేంద్రాలు బోలెడున్న మాట నిజమే. కానీ అక్కడ పొద్దుటినుండి రాత్రిదాకా మాత్రమే కదా చూసేది. మిగతా వేళల్లో మాత్రం ఎవరు చూస్తారు?

ఇదీ సమస్య.

ఈ తరం యువజంటల నెన్నింటినో పీడిస్తున్న సమస్య.

ఆ సమస్యని గురించి ఆలోచిస్తూనే ఇద్దరూ భోంచేశారు.

అదే ఆలోచిస్తూ నడుములు వాల్చారు.

ఆలోచిస్తూ ఆలోచిస్తూనే నిద్రను ఆశ్రయించారు.

* * *

సముద్రగర్భంలో ఉన్న శిశువు అసహనంగా కదిలింది.

చేతులకీ కాళ్ళకీ బుల్లి బుల్లి వేళ్ళు రూపుదిద్దుకుంటున్నాయి. గర్భసంచీలో వాడి కదలిక నెమ్మదిగా ఆరంభమైంది.


దీనిద్వారా బిడ్డ తన శరీరంలోని కండరాలను కదలికలను అలవాటు చేస్తోంది. శిశువు తల గతంలోకన్నా గుండ్రంగా రూపుదిద్దుకుంటోంది.

శిశువు బరువు 18 గ్రాములుండి, అయిదున్నర సెంటీమీటర్ల పొడవు ఉంది.

అవిద్యాత ప్రబోధ సా గర్భదుఃఖాది సంయుతః

హా కష్టమితి నిర్విణ్ణః స్వాత్మానం శోశు చీత్యధ

## కట్నం!



గోవిందరావుతో బాధగా చెప్పాడు మాధవరావు ''అమ్మాయి పెళ్ళికి ఏభైవేలు కట్నమిచ్చినా ముష్టివాడు కూడా ముందుకు రావట్లేదురా!''

''అంత అక్కర్లేదు బాబయ్యా! నాకైతే ముప్పై వేలు చాలు!'' ఆశగా అన్నాడు వాళ్ళింటి ముందుకొచ్చిన బిచ్చగాడు.

గొంటు శ్రీనివాస్ (కడెమ)

ఆ గర్భాలయమందు జన్మజన్మాంతరముల యొక్క జ్ఞానం జాగృతమగును. వర్తమాన గర్భ దుఃఖము చేత ఖిన్నుడై "ఔరా! ఎలాంటి కష్టములో నేను పడియున్నాను" అని ఈ విధముగా విచారిస్తూ తనపైతనకే కరుణ మరియు దుఃఖము కలిగి శోకసంతప్తుడగుచున్నాడు

అనుభూతే మహాసహా: పురా మర్మచ్ఛిదో సకృత్
కంభవాలు కాస్తాప్తా వహ్యంతే చాసుభాశయా:

పూర్వ జన్మలో నకరయోనులలో అనేకమార్లు గొప్పనైన అసహ్యమగు మర్మచ్ఛిద్ర దుఃఖములను నేననుభవించాను. కాలుచున్న ఇసుక శయ్య (పడక)పైన పడుకోబెట్టినప్పుడు బియ్యము వగైరా ధాన్యమును వేయించినట్లు అట్టి దుఃఖమును కూడా నేను అనుభవించాను.

జఠరానల సంతప్తా: పిత్తాఖ్యరస విప్లుషః
గర్భాశయే నిమగ్నం తుదహ్యం త్యతి భృశం హి మామ్"

కానీ ఈ సమయంలో గర్భాశయంలో జఠరాగ్నిచేత నిరంతరం మసలుచున్న పిత్తాది రసముల యొక్క గొప్ప ప్రవాహంలో మునుగుతున్న నాకు దానికంటే కూడా అధికమైన తాపము (బాధ) కలుగుచున్నది.
(ఆచార్య శ్రీ శంకరానంద స్వాములవారు రాసిన శివగీత లోనివి)

శిశువు వలవలా ఏడుస్తున్నాడు. కానీ అతని ఏడుపు ఎవ్వరికీ వినిపించడం లేదు. ఆఖరికి అతను ఎవరి కడుపులో ఉన్నాడో ఆమెకి కూడా వినిపించడం లేదు.

భగవంతుడా నాకు విముక్తినివ్వు. నాకిక్కడ ఉండాలని లేదు. ఇంతకంటే నరకంలోకి తీసుకుపో. అక్కడి శిక్ష పూర్తిచేసి నీలో కలుపుకో!

శిశువులోని ఆత్మ మనసారా భగవంతుడ్ని ప్రార్థిస్తోంది.

మరి భగవంతుడు విన్నాడో లేదో! వినికూడా మౌనంగా ఊరకుండిపోయాడేమో.

శిశువు స్పష్టంగా విన్నాడు తను బయటికి రావడం ఆకాష్ సముద్రలకి ఇష్టం లేదని!

వాళ్లు ఏదోవిధంగా తనని వదిలించుకోవాలని చూస్తున్నారని.

అలాంటప్పుడు తన మొర ఆలకించి భగవంతుడే గర్భస్రావం చేసేస్తే ఎంత బావుంటుంది.

శిశువు మౌనంగా భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాడు.

* * *

సముద్రకి ఎలాగైనా అబార్షన్ అయిపోతే బాగుండునని ఉంది.

ప్రెగ్నెన్సీ పుస్తకం తెచ్చుకుంది కొనుక్కుని.

తీరిగ్గా మంచంమీద కాళ్ళు జాపుకుని కూర్చుని చదవసాగింది. కానీ అందులో క్లియర్‌గా ఏమీ దొరకలేదు.

'డ్రగ్స్ టు అవాయిడ్ ఇన్ ప్రెగ్నెన్సీ' అని ఉన్నచోట కుతూహలంగా చూసింది.

ఇన్‌ఫెక్షన్‌కీ ఫీవర్‌కీ వాడే యాంటీ బయాటిక్స్, యాంటీ మలేరియల్, యాంటీ థైరాయిడ్ డ్రగ్స్ మొ. చాలా ఇచ్చాడు బుక్‌లో.కానీ అవి అబార్షన్ చేయడం అటుంచి పుట్టే శిశువుని అబ్‌నార్మల్‌గా పుట్టిస్తాయి. అది మరీ కష్టం కదా!

విసుగ్గా పుస్తకాన్ని మూసేసింది.

బొప్పాసకాయ తినకూడదంటారని తను వింది. మేడలు ఎక్కి దిగకూడదు. స్ట్రెయిన్ కాకూడదు. రష్‌గా ఉన్న బస్సుల్లో ఎక్కకూడదు.

ఇవన్నీ ఆచరించి చూద్దాం ఆపైన తన లక్ అనుకుంది సముద్ర. అప్పటికప్పుడే తయారైంది.

నిజానికి ఆమెకి చాలా వీక్‌గా ఉంది.

కడుపులో తిప్పుతున్న ఫీలింగ్.

అయినాసరే రెస్ట్ తీసుకోవాలనిపించలేదు. అబార్షన్ అయితే ఏకంగా ఫ్రీగా కొన్నాళ్ళు రెస్ట్ తీసుకోవచ్చు.

ఆ తర్వాత తను ఆకాశ్‌తో చాలా జాగ్రత్తగా ఉంటుంది.

అతను కేర్‌లో లేకపోతే దగ్గరికే రానివ్వదు.

అవును మరి! అతను బానే ఉన్నాడు. మధ్యలో తిరకాసు వచ్చింది తనకేగా!

ఇన్నిన్నిసార్లు అబార్షన్ అయితే హెల్త్ పాడవుతుంది అంది కదూ డాక్టర్.

ఆ తర్వాత ఓ నెల రెస్ట్ తీసుకుని మంచి విటమినైజ్డ్ ఫుడ్ తింటే సరి.

ఇంకోమాట ఏమంది డాక్టర్! ముప్పై దాటితే పిల్లలు పుట్టడం కష్టమని కదూ అన్నది.

## రాజుగారి దెబ్బ!



'రాజుగారు తల్చుకుంటే... దెబ్బలకు కొదువా? అన్నట్లు బీహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ గారు తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత తన ముగ్గురు పిల్లల్ని ఓ మంచి కాన్వెంట్ స్కూలుకి పంపి చేర్చుకోమన్నాడట— ఎంతో స్ట్రిక్ట్ అని పేరు తెచ్చుకున్న ఆ ప్రిన్స్‌పాల్‌గారు... ఎంట్రెన్స్ టెస్టు పెడతానన్నారట! 'నో' అన్నారట— లాలూగారు! ఏం చేయలేని ప్రిన్సిపాల్‌గారు— ఎడ్మిషనే నా? ఇంకేమన్నానా కావాలా? అన్నారట! ఒకడ్ని తర్వాత క్లాస్ లోకి జంప్ చేయాలన్నారు లాల్యూప్రసాద్! దానికే తల ఊపారట ప్రిన్సిపాల్‌గారు! ఇంకా నయం... ముగ్గురికే ఫస్ట్ ర్యాంకులు ఇవ్వాల్సిందే— అని హుకూం జారీచెయ్యలేదు!!

—హాపీలక్

అంత కష్టమైతే కనడం మానేస్తుంది. వాటీజ్ దేర్?

తను పూర్తిగా సెటిలైపోయింది అనిపించాక అప్పుడు అంతగా కావాలనుకుంటే ఏ ఆర్ఫనేజ్ నుంచో అందమైన పాపాయిని తెచ్చుకుని పెంచుకుంటుంది.

ఈ మధ్య ఏదో పుస్తకంలో రజనీష్ సందేశం చదివింది తను. అందులో అతను మన దేశ జనాభా తగ్గించడానికి ఓ ఉపాయం చెప్పాడు.

'ప్రస్తుతపు యువతీ యువకులు తమకు పిల్లలు పుట్టాలి అని ఆలోచించకుండా పిల్లల్ని పెంచుకోవాలి అని నిర్ణయించుకోవాలి. అది అమలులో పెట్టాలి. అలా అయితే కొత్తగా జనాభా పెరిగే సమస్యా ఉండదు. ఆశ్రమాలలో పిల్లలకీ ప్రేమాదరణలు లభిస్తాయి'

నిజంగా ఎంతో బాగా చెప్పాడు కదూ!?

కాలింగ్ బెల్ మ్రోగింది.

విసుగ్గా లేచి వెళ్ళి తలుపు తీసింది.

ఎదురింటావిడా, పక్కింటావిడా నిలబడి ఉన్నారు. వాళ్ళతో మాట్లాడాలని లేదు సముద్రకి. నిజానికి ఆమెకి ఎప్పుడూ వాళ్ళతో మాట్లాడాలని అనిపించదు.

చదువు సంధ్యలు అంతంతమాత్రంగా ఉండటంతో వారి సంస్కారమూ అంతంతగానే ఉంటుంది.

ఎంతసేపూ, ఎవరో ఒకరిమీద ఏవో ఒకటి చెప్పుకుంటూ ఉంటారు.

అసలు ఆడజాతిలోని ఇలాంటి చీడపురుగులే పూర్తి జాతి పాడుచేసేందుకు కంకణం కట్టుకునేది.

ఇలాంటి వాళ్ళని ఏరిపారేస్తే తప్ప తమ జాతికిబాగు ఉండదు.

''అలా మౌనంగా నిలబడిపోయారేంటండీ? మమ్మల్ని లోపలికి రమ్మని చెప్పరా?''

''రండండి'' తప్పనిసరిగా అంది సముద్ర.

ఇద్దరూ బిలబిలా లోపలికి వచ్చి కూర్చోమనకుండానే కూర్చున్నారు.

''కంగ్రాట్సండీ సముద్రగారూ!'' పక్కావిడంది.

''దేనికి?''

''మీరు తల్లి కాబోతున్నందుకు?!''

విసుగ్గా చూసింది సముద్ర.

''స్వీట్స్ బాగా తింటూండండి. అలాగైతే మీవారిలాంటి అందమైన బాబు పుడ్తాడు'' ఎదురింటావిడ అంది.

''నేను ప్రెగ్నెంట్‌ని అయితే కదా మీరివన్నీ చెప్పవలసింది''

''అవును''

''నేను ప్రెగ్నెంట్‌ని కానేకాదు''

''అదేంటి మీ మాటలు విన్నానే'' అంది పక్కింటావిడ.

''మీరేం విన్నారో ఎవరి గురించి విన్నారో కానీ నేను మాత్రం గర్భిణిని కాను. ఇప్పుడు గర్భం దాల్చే ఉద్దేశంలో అసలే లేను''

''ఉద్దేశంలో కూడా లేకపోవడమేంటండీ మీ పెళ్ళై నాలుగేళ్ళయింది కదా''

''వయసు ముదిరితే కష్టంకూడా కదా''

సముద్ర వాళ్ళవైపు కోపంగా చూస్తూ అంది. ''మీరు కన్నారుగా ఒకర్నీ ఇద్దర్నీ కాకుండా ముగ్గుర్నీ నలుగుర్నీ దానివల్ల మీకు లభించిందేంటండీ?'' అని.

ఇద్దరు అమ్మలక్కలు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

కానీ వెంటనే తేరుకున్నట్లుగా పక్కావిడ అంది.

''ఆడవాళ్లుగా పుట్టినందుకు పిల్లల్ని కని మా జన్మ ధన్యం చేసుకున్నాం'' అంది.

''వాళ్ళ ముద్దుమాటలూ, బుడిబుడి అడుగులూ చూస్తూవుంటే మా దంపతులం అనుకుంటాం— వీళ్ళు లేకుండా ఇన్నేళ్ళు మనం బ్రతికిందీ ఓ బ్రతుకేనా అని'' అంది ఎదురింటావిడ.

సముద్ర ఇద్దర్నీ మార్చిమార్చి చూసింది.

''ఏమిటండీ అలా చూస్తున్నారు?'' అంది పక్కావిడ.

''మీరు తెచ్చిన గిన్నెల సైజులెంత ఉన్నాయా అని!''

''అంటే?''

''ఏముంది? ఏడాదికో శిశువుని సునాయాసంగా కనడంవల్లే కదా పాపం మీకిలాగ గిన్నో, గ్లాసో తీసుకుని అప్పులకెళ్ళాల్సి వస్తోంది అని జాలిగా చూస్తున్నాను'' అంది కసిగా.

వాళ్లిద్దరి ముఖాలూ తెల్లగా పాలిపోయాయి.



''చూడండి! నేనెప్పుడూ మీరు అప్పులకొచ్చారే అని అనుకోలేదు. మీ పరిస్థితి ఎలాంటిదో నాకు తెలుసు. కనక ఏరోజూ కాదనలేదు కూడా! ఇవాళ కాదు అని అనబోవడం లేదు.

కానీ మీకు నేను చెప్పే సలహా ఒక్కటే. సాటి స్త్రీల గురించి చులకనగా మాట్లాడటం మానేయండి మీకు చేతనైతే ఏ ఆడదానికైనా కాస్తంత సాయం చెయ్యండి. లేదా గమ్మున ఊర్కోండి' అంది.

క్షణంసేపు గదిలో నిశ్శబ్దం మఠం వేసుకుని కూర్చుంది.

వాళ్ళిద్దరికీ సముద్ర చెప్పిన విషయాలు నిజమని తెలుసు. అయినా అవి అంత నిర్మొహమాటంగా ముఖంమీదే చెప్పెయ్యడంతో అవమానంగా ఫీలవ్వసాగారు.

''చెప్పండి ఏం కావాలి?''

''......''

''గోధుమపిండా, పంచదారా, పాలా?''

''పాలు'' పక్కావిడ అంది.

''కందిపప్పు'' ఎదురింటావిడ అంది.

ఈసారి వాళ్ళని చూస్తే నిజంగా జాలేసింది సముద్రకి.

ఎంత అవమానంగా ఉన్నా అప్పు అడగక తప్పని దౌర్భాగ్యపు జీవితాలు పాపం వాళ్ళవి. తమ పరిస్థితులేమిటో తెలీకుండా పిల్లల్ని కనేస్తూ రావడమో, లేకపోతే మగమహారాజు జన్మించడం కోసం కంటూపోవడమే చేసే తల్లిదండ్రులందరూ ఇలా అప్పుల్లో మునిగి పోవాల్సిందే అనుకుంది.

లేచి వెళ్ళి వాళ్ళడిగినవి తెచ్చి ఇచ్చింది.

అవి తీసుకున్న వెంటనే వాళ్ళు వెళ్ళారు.

సముద్ర ఒక్కతే ఒంటరిగా మిగిలిపోయింది.

ఆమెకి తన అక్క గుర్తొచ్చింది.

బావ డాక్టరు. వాళ్ళ పెళ్ళినాటికి ఎంబీబియ్యస్ మాత్రమే పూర్తి చేసాడతను. కనక అక్కా బావా కొన్నాళ్ళు ఫామిలీని ప్లాన్ చేద్దామనుకున్నారు.

కానీ పెళ్ళయి ఏడాది కావడంతోనే వాళ్లత్తగారి తరుపు బంధువులంతా ప్రాణాలు తోడేయసాగారు ''ఇంకా ఎప్పుడు కంటారు పిల్లల్ని'' అని!

ఒకళ్ళిద్దరు పెద్దవాళ్ళు వాళ్లత్తగారి చెవిలో గుసగుసలాడారుట కూడా 'ఏ లేడీ డాక్టరుకో చూపించు మీ కోడల్ని ఇంకా ఆలస్యమైతే కష్టం'.

ఈ గొడవంతా విని విని విసిగిన వాళ్ళత్తగారు ''మీరు పిల్లల్ని కంటారా సరేసరి లేదా నేను కాశీకి పోతాను. ఇంక రానేరాను. మీకు ఆరు నెలలు టైమిస్తున్నాను'' అన్నారుట.

''సెటిల్ కానీవే అమ్మా జీవితంలో'' అని బావగారు అన్నారుట.



అప్పుడావిడ "ఏమోరా నీ కొడుకు తెచ్చే అదృష్టంవల్ల నువ్వు త్వరగా సెటిల్ అవుతావేమో! ఎంతమంది విషయంలో ఇలా కాలేదు" అన్నార్త.

ఏమైతేనేం ఏడాది తిరిగేలోగా అక్క ఓ ఆడపిల్లకి తల్లయింది.

బావ ఇంకా అందుకోనే లేదు.

నిట్టూర్చింది సముద్ర.
అబార్షన్ అయ్యేందుకు ఏవేం చెయ్యాలని అనిపిస్తే అవన్నీ చేసింది సముద్ర.
కానీ అబార్షన్ కానేలేదు.
'గట్టిపిండం అంటే ఇదేనేమో' అనుకుంది.
రాత్రి పడుకోబోయేముందు షవర్ బాత్ అలవాటు సముద్రకి. అలా చెయ్యకపోతే నిద్రపట్టదు.
ఆరోజు కూడా అలాగే హాయిగా జలక్రీడలాడింది.
టవల్ చుట్టుకోబోతూ క్షణంసేపు అద్దంలో తనని తాను పరిశీలనగా చూసుకుంది.
తెల్లటి శరీర ఛాయ
అందమైన అంగ సౌష్టవం.
నల్లటి పొడుగైన కురులు!
ఇవన్నీ చూసి చిన్నప్పటినుండీ ఎందరో అభినందిస్తూ వచ్చారు.
కా...నీ డెలివరీ అయితే ఇవన్నీ ఇలా వుంటాయా?
ఒక్క బిడ్డ తల్లి అయితే అందం ఆవిరైపోతుందని తను ఎన్నోచోట్ల చదివింది.
సినీ తారలు కూడా వివాహితులుగా ఉన్నా రాణించరు. కానీ పిల్లల తల్లులయ్యాక మాత్రం తల్లులుగానే నటించడమో తెరచాటుకు తప్పుకోడమో చేస్తూ వచ్చారు.
ఏ డ్రెస్ వేసినా నప్పినట్టే ఉంటుంది తన ఒంటిమీద.
కానీ ఇంక అలా కుదరదు.
తెల్ల చారలు పొత్తి కదుపుమీద మొదలై పైదాకా వ్యాపిస్తాయి. బ్రెస్ట్‌మీద కూడా అవి బైటా యిస్తాయి.
ఎంత ఒళ్ళు రాకుండా ఎక్సర్‌సైజ్ చేసినా కదుపు మునపటిలాగా పట్టుగా ఉండదు. కొద్దిగా జారినట్లవుతుంది.
జట్టు సరేసరి బలహీనమై తోకలాగ తయారుకావడం తథ్యం.
''సముద్రా''
''ఊఁ!''
''త్వరగా రా!''
''ఎందుకు?''
''నాకు బోర్ కొడ్తోంది''
సముద్ర టవల్‌ని ఒంటికి చుట్టుకుని తలుపు తీసింది.
''ఇవాల్టినుండి నీకో పనిపడుతోంది ఆకాశ్''
''ఊఁ!''
''ఏమిటని అడగవేం?''

"చెప్పు?"

"నాకు విటమిన్ ఈ రాయాలి"

"ఎందుకు?"

"అది రాసుకుంటే పొట్టమీద తెల్ల చారలు పడవు"

"సరే తీసుకురా!"

ఆరోజే తను కొని బ్యాగ్‌లో పడేసుకున్న సీసా తెచ్చిచ్చింది.

"ఎక్కడ రాయను?" అడిగాడు

చీరని కొద్దిగా తొలగించి "ఇక్కడ" అంది సముద్ర.

అతను ఆమెనే చూస్తూ "ఇంకాస్త దగ్గరికి రా రాస్తాను" అన్నాడు

సముద్ర ఆ పనే చేసింది.

కానీ అలా చెయ్యడంవల్ల ఆమె పని పూర్తి కాలేదు. అతని కోరిక మాత్రం కమ్మకమ్మగా నెరవేరింది.

ఆ తర్వాతైనా మాసె ప్రసక్తి రాలేదు అలసినవారు ఆదమరచి నిద్రపోవడంతో!

* * * *

సముద్ర గర్భంలోని శిశువుకి ఉక్కిరి బిక్కిరి అవుతున్నట్టుగా వుంది.

వాదర్శ క్రిమివక్త్రాణి కూట శాల్మలి కంటకైః
తుల్యాని తుదంత్యార్తం పార్శ్వాస్థి క్రక చార్దితమ్

ముని యొక్క కూట శాల్మలి యను పేరుగల గదలో మరియు నారకీయ యంత్రములకు గల ఇనుప ముండ్లవలె తల్లి గర్భమందున్న అసంఖ్యాకమైన క్రిములు అతి

## కారెక్టర్!



భర్తతో కోపంగా అంది భార్య "ఏంటీ... పని మనిషి చెయ్యి పట్టుకున్నార్ట... ఆ..."

"ఊర్కే నే... మన్లాటి పరువుగల వాళ్ళింట్లో పనిచేసే దాని కారెక్టర్ ఎలాంటిదో టెస్ట్ చేద్దామని పట్టుకున్నానంతే!"

"...?!?"

-గొంటు శ్రీనివాస్ (కడిమి)

ఘోరంగా కొరుకుతున్నవి. రెండవవైపు తల్లియొక్క ప్రక్క ఎముకల కింద రంపము క్రింది కర్రవలె నలిగిపోవుచున్నాను.

దీనికి తోడు తన తల్లిదండ్రులైన వారిద్దరి మాటలో ప్రవర్తన తనని మరింతగా బాధిస్తున్నాయి.

వాళ్ళిద్దరికీ తను అక్కరలేదు.

ఏ శక్తయినా తనని కడుపులోనే చంపేస్తే అంతకంటే వాళ్లకి కావలసిందేదీ లేదు.

కా...నీ తను ఛావడు.

చస్తే ఎలాగా?

తనో పాపాల పుట్ట గత జన్మలో! ఆ పాపాలు ప్రాయశ్చిత్తమైతే కానీ తన ఆత్మ తిరిగి పోయే ప్రసక్తేలేదు. అంతలోపల ఈ శరీరపుతొడుగూ తప్పదు.

అసలు అసలు ఎవ్వరూ తమ సాధక బాధకాలను గురించి కనీసం ఊహించనైనా ఊహించరేం?

తమను అక్కరలేదు అనుకుంటున్నవారి కడుపున పడడం ఎంత బాధాకరం!

ఆ రకమైన స్త్రీలు తమను చంపేయడానికి ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తారు.

ఆమె... తన తల్లి కూడా అదే పని చేస్తోంది. కా...దు కాదు చేసింది.

కానీ తను చావలేదు.

అయితే ఏం?

తన శరీరం ఎంత గిలగిల్లాడిపోయింది?

ఊపిరాడక తనెంత ఉక్కిరి బిక్కిరి అయిపోయే స్థితి వచ్చింది!

ఆ బాధ అయినా ఓ రోజూ రెండ్రోజుల్లో పోయిందా. లేదు.

చాలా రోజులుగా ఆమె ప్రయత్నంలోనే ఉంది.

ఎలాగైనా తాను చావాలి.

అదే ఆమె ప్రస్తుత కోరిక.

అందుకే ఎవ్వరికీ తను కడుపులో ఉన్న విషయం చెప్పలేదు.

ఇప్పుడింకో గత్యంతరం లేక తనని రిసీవ్ చేసుకోవాలని వాళ్ల అనుకుంటున్నారా? కాదు కాదు ఆఖరులోనైనా ఏ డాక్టరో సాయపడకపోతుందా అనుకుంటున్నారు.

అందుకే తను నోళ్ళు తెరిచి ఒక్కరికంటే ఒక్కరికి కూడా సంతోషంగా తాము తల్లిదండ్రులు కాబోతున్న సంగతి చెప్పడంలేదు.

తనకిలాగ కావలసిందే!

తను చేసింది మామూలు పాపమా? కాదే!

ఆ పాపాన్ని తలుచుకుంటే ఇప్పుడు ఒళ్లు జలదరిస్తుంది.

మరప్పుడు లేనిది ఎలా చెయ్యగలిగాడు! అతని మనసు గత జన్మలోని సంగతుల వైపుకు

ప్రయాణం కట్టింది.

* * * *

"నీకు పెళ్ళాం పుట్టిందిరా శ్రవణ్" అంది పార్వతి కొడుకుని దగ్గరికి తీస్కుంటూ!

అయోమయంగా చూసాడు శ్రవణ్.

"మామయ్యకి కూతురు పుట్టిందిరా! అది పెద్దయి నీ పెళ్ళాం అవుతుంది".

శ్రవణ్ ఇంక ఆగలేదు.

మామయ్య ఇంటికి పరిగెట్టాడు.

మామయ్య అక్కడి పెద్దలందరితో ఇంటి బయట అరుగుమీద కూర్చుని ఉత్సాహంగా మాట్లాడ్తున్నాడు.

"మామయ్యా!"

"ఊ" అన్నాడే కానీ కృష్ణమూర్తి శ్రవణ్ వైపుకు తిరగనేలేదు.

వాళ్ళ మాటలు కొనసాగుతూనే ఉన్నాయి.

శ్రవణ్ కి ఉక్రోషంగా అనిపించింది.

"మామయ్యా నా పెళ్ళాం ఏదంటే మాట్లాడవేం?" గట్టిగా అడిగాడు.

ఆ మాటతో వాళ్ళ మాటలు ఆగిపోయాయి.

కృష్ణమూర్తి గట్టిగా నవ్వాడు.

మేనల్లుడిని దగ్గరికి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు.

"అబ్బో అప్పుడే మస్కా కొట్టేస్తున్నారే!"

"మస్కా కాదండీ బాబూ మనస్ఫూర్తిగా ముద్దు పెట్టుకుంటున్నాను. మన దేశంలోని ఆడపిల్లలకి ఏ లోపమూ లేకపోయినా సరే ఏదో ఓ వచ్చు కారణం చూపి తాళి కట్టడానికి

## నాలుక ముద్రలు?!



నేర పరిశోధనలో వేలుముద్రలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది! అయితే మన వేలు మీద ఉన్నట్లే, నాలుక మీద కూడా కొన్ని ముద్రలు ఉంటాయి! వేలుముద్రల ద్వారా మనుషుల్ని ఎలా గుర్తుపట్టవచ్చో అలాగే నాలుక ముద్రలతో కూడా మనిషిని గుర్తించవచ్చు! అంటే ఒకరి నాలుక ముద్రతో మరొకరి నాలుక ముద్ర కలువదన్నమాట! సో... నేరాలు చేసేవాళ్ళు ఇక నుంచి... నాలుకను కూడా దేనికీ ఉపయోగించకూడదండోయ్!

—జూపిటర్

బెట్టు సరిచేసే దౌర్భాగ్యపు పెళ్ళి కొడుకుల్నేగా మనం రోజూ చూస్తూ వున్నది.

కానీ నా మేనల్లుడ్ని చూడండి నాకిలాగ కూతురు పుట్టిందో లేదో అలా దాన్ని తన పెళ్ళాంగా చెప్పేసి నాకు బరువు లేకుండా చేసాడు'' అన్నాడు మురిపంగా!

''చెప్పు మామయ్యా!'' శ్రవణ్ త్వరపెట్టాడు.

''లోపలుందిరా''

శ్రవణ్ లోపలికి దూసుకుపోయాడు.

అత్తయ్య పక్కన పడుకున్న పాపాయిని కుతూహలంగా చూసాడు.

లేత గులాబి రంగులో ఉంది పసికందు.

చిన్న చిన్న చేతులు రెండూ పైకి పెట్టున్నాయి.

చిట్టి చిట్టి గుప్పిళ్ళు మూసి ఉన్నాయి.

నల్లటి ఉంగరాల జుట్టు ముద్దొచ్చేలా ఉంది.

''పాప బాగుందా బాబూ'' అడిగింది అతని అత్తయ్య.

''చాలా బాగుంది'' మెరిసే కళ్ళతో అన్నాడు.

''దీనికో మంచి పేరు కూడా పెట్టాలి పెద్దవాళ్లని కూడా సంప్రదించి''

''పెద్దవాళ్లెవ్వరూ పెట్టడానికి వీల్లేదు నేనే పెడ్తాను దీనికి పేరు ఇది నా పెళ్ళాం కదా మరి!''

ఫక్కున నవ్వింది అతని అత్తయ్య.

కానీ శ్రవణ్ అన్నట్లుగా అతనే ఆ పిల్లకి పేరు సెలెక్టు చేసి పెట్టాడు.

అందరికీ కూడా ఆ పేరు నచ్చడంతో నామకరణ కూడా శ్రవణ్ ఇష్టంతోనే జరిగిపోయింది.

పాపాయి పేరు శ్రీల.

ఆ పాపాయి శ్రవణ్ పెళ్ళాంగానే పరిగణనలోకొచ్చింది. అలాగే పెరుగుతూ వచ్చింది.

ఎటొచ్చీ వారిద్దరివీ భిన్నమైన స్వభావాలు.

శ్రవణ్ బద్ధకస్తుడు.

శ్రీల చాలా చురుకు.

ఇద్దరూ తెలివైనవారే! కానీ ఆ తెలివితేటల్ని ప్రదర్శించడంలో ఇద్దరూ భిన్నంగా కనబడ్డారు.

శ్రవణ్ స్వార్థపరుడు.

శ్రీల నిస్వార్థపరురాలు.

శ్రవణ్ లోని ఈ గుణాలు శ్రీలకి తెలుసు.

శ్రీలలోని ఆ గుణాలూ శ్రవణ్ కి తెలుసు.

అయినా ఇద్దరి మధ్యా అనుబంధం పెరుగుతూ వచ్చిందనే చెప్పాలి.

శ్రీల ఆరోజు స్కూల్ నుండి చాలా ఉత్సాహంగా వచ్చింది. దానికి కారణం ఆ అమ్మాయికి పరుగుల పందెంలో మొదటి బహుమతి రావడమే. ఆ పందెం కూడా ఆమె బడిలోని పిల్లల మధ్య జరిగినది కాదు.

ఆ ఊర్లోని అన్ని బాలికల పాఠశాలలకి పెట్టిన పోటీ అది.

ఆ సంగతి విని ఆ అమ్మాయి తల్లి చాలా సంతోషించింది.

భర్త రాగానే సంతోషంగా చెప్పింది అతని చేతికి మిఠాయి ఇచ్చి.

''అమ్మాయేదే?'' అడిగాడు కృష్ణమూర్తి మిఠాయి నోట్లో వేసుకొని.

ఆమె మురిపెంగా కూతుర్ని పిలుచుకుని వచ్చింది.

అతను శ్రీలని దగ్గరికి తీసుకున్నాడు.

ఆమె చేతిలో చిన్న పేకెట్ ఇచ్చి అన్నాడు.

''కంగ్రాట్స్ తల్లీ'' అని!

''థాంక్స్ నాన్నా!''సిగ్గుగా అంది శ్రీల.


''అంటే మీకీ సంగతి ముందే తెలుసా?''

''అవునే! మా ఆఫీస్‌కి వీళ్ల స్కూల్ పి.టి సర్ స్వయంగా వచ్చి ఈ మాట చెప్పాడు.

''ఆయన ఇంకా ఏమన్నాడో తెల్సా?''

తల్లీ కూతురు కృష్ణమూర్తి వైపే చూడసాగారు.

''మన శ్రీలని పెద్ద క్రీడాకారిణిని చేస్తానన్నాడు. చేసి తీర్తానని ఛాలెంజ్ చేసాడు. అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర పోటీల్లోనే కాదు అంతర్దేశ పోటీల్లో కూడా పాల్గొని పతకాలు



సంపాదించగల సత్తా మనమ్మాయిలో స్పష్టంగా కనిపిస్తోందన్నాడు. అలాంటి కళని అభివృద్ధి చేసి అత్యుత్తమంగా ఎదిగే చేయూతని నేనిస్తాను. కానీ మీ ప్రోత్సాహం కూడా తప్పనిసరిగా ఉండాలి. అది చెప్పడానికే వచ్చానన్నాడు.

ఆ మాట వినగానే నాకు చాలా సంతోషం కల్గింది. చదువు, సంగీతం, నాట్యం మాత్రమే ప్రోత్సహిస్తూ వచ్చాం మన ఆడపిల్లల్లోని కళలుగా ఇన్నేళ్ళనుండి.

కానీ చేవ ఉన్న ఏ కళనైనా ఎవరైనా ప్రోత్సహించి తీరవలసిందే.

ఈ పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా నా కూతురు అత్యుత్తమంగా ఉంది అంటే నాకు అంతకన్నా గర్వకారణం మరొకటి లేదు.

ఆ మాటే అతనికి చెప్పాను.

శ్రీల తండ్రివైపు ఆరాధనగా చూడసాగింది.

"మరి దాని చేతికిచ్చిందేంటండి?" అడిగింది రుక్మిణి.

"తెరిచి చూస్తే తెలుస్తుందిగా" నవ్వాడు.

శ్రీల గబగబా తెరిచింది.

అందులోంచి ఓ అందమైనప్లాస్టాఫ్‌పారిస్ బొమ్మ బయటికి తీసింది.

చాలా చక్కగా ఉంది ఆ బొమ్మ.

మంచి రంగులతో ఉన్న ఆడపిల్ల బొమ్మ అది దాని కింద రాసుంది

'వరల్డ్ గ్రేటెస్ట్ డాటర్' అని!

కళ్ళింది శ్రీల.

నువ్వు నిజంగా అంత గొప్పదానివవుతావమ్మా అంటున్నాయి కన్నతండ్రి కళ్ళు.

థాంక్యూ నాన్నా థాంక్యూ వెరీమచ్ అంది తండ్రి చేతులు ఊపేస్తూ శ్రీల.

"ఉత్తినే ఆ మాట అనేయడం కాదు నీవు ఆ స్థితికి వస్తేనే నాకు కృతజ్ఞతలు చెప్పినట్టు లెక్క" అన్నాడు కృష్ణమూర్తి.

తల ఊపింది శ్రీల.

* * * *

"ఓస్ ఇదా నువ్వు చెప్తానని ఇందాకట్నుంఛీ ఊరించిన శుభవార్త" అన్నాడు శ్రవణ్

"అవును. నీకు శుభవార్తలాగ లేదా?"

"లేదు శ్రీలా!"

"ఏం?"

"కళ అంటే కనువిందు చేయాలికానీ కళ్ళు దించుకునేలాగ ఉండకూడదు."

"అంటే నీ ఉద్దేశం?"

"నిండుగా పట్టుచీర కట్టుకుని స్టేజ్‌మీద కూర్చుని తాళం వేస్తూ సంగీతం

పాడడమూ, సాంప్రదాయకమైన చీరని చక్కగా ఒంటికి చుట్టబెట్టుకుని కాలి పట్టీలు ఘల్లు ఘల్లుమంటుండగా డాన్సు చెయ్యడమూ కనువిందు చేస్తాయి. కానీ ఇది అలాంటిది కాదు.''

''అదే ఎందుకు?''

''చిన్న గోచీ గుడ్డలాంటి లాగు తొడుక్కుని, పైన చేతుల్లేని బనీను వేసుకుని, వందలాది వేలాది మంది చూస్తుండగా ఒంపు సొంపులను ప్రదర్శిస్తూ పరుగెత్తడం ఎంత అసహ్యంగా ఉంటుంది!''

''ఆ పోటీని చూసేవారంతా నా ఒంట్లోని సత్తాని చూస్తారు సౌందర్యాన్ని కాదు.''

''అది నీ అభిప్రాయం''

''ఏం కాదు నేను చెప్తున్నది అక్షర సత్యాన్ని కళని కళగానే చూస్తారు. కరతాళ ధ్వనులతో చుట్టుముడ్తారు తప్ప కళని కుత్సిత బుద్ధితో ఎవ్వరూ చూడరు.''

''కళలను గురించి నీకే తెల్సినట్లుగా మాట్లాడ్తున్నావే!''

''నాకు కూడా కళలను గురించి తెలుసని చెప్తున్నాను.''

''అయితే అసలు కళలు ఎన్నున్నాయో చెప్పు చూద్దాం''

''శ్రీల కోపంగా అతనివైపు చూసింది.

తర్వాత చెప్పుకుపోయింది.

''కళలు అరవైనాలుగు. అవేమిటో కూడా విను.

1. ఇతిహాసము, 2. ఆగమము 3. కావ్యము 4. అలంకారము 5. నాటకం 6. కవిత్వం 7. కామశాస్త్రం 8. దేశభాషాలిపి జ్ఞానము 9. వాచకము, 10. అవధానము 11.

## రుజువు!



తండ్రితో కోపంగా అన్నాడు కొడుకు ''నువ్వు క్రిందటి జన్మలో పాపం చేశావని ఖచ్చితంగా నాకు రుజువైంది నాన్నా...''

''ఎలారా?''

''మళ్ళీ నా పరీక్ష పోయింది!''

—యం.వి.కిరణ్‌కుమార్ (విజయవాడ)

సర్వశాస్త్రము 12. శాకునము 13. సాముద్రికము 14. రత్నశాస్త్రము 15. మల్లశాస్త్రము 16. దోహదము 17. గంధవాదము 18. ధాతువాదము 19. రాసవాదము 20. జలవాదము 21. అగ్నిస్తంభం 22. ఖడ్గస్తంభం 23. జలస్తంభం 24. వాక్స్తంభం 25. వాయుస్తంభం 26. ఆకర్షణము 27. మోహము 28. విద్వేషణము 29. పరకాయప్రవేశము 30. పాదుకాసిద్ధి 31. ఇంద్రజాలికము 32. అంజనము 33. మణిమంత్రౌషధసిద్ధి 34. చోరకర్మము 35. చిత్రక్రియ 36. లోహక్రియ 37. అశ్వక్రియ 38. కృషి 39. కౌశలము 40. చిత్రలేఖనము 41. సంగీతము.

వినడానికి వింతగా ఉన్నా ఇవే లలితకళలు ఇందులో వున్న కళలు నాకు గుర్తున్నాయి. అనేసి విసురుగా వెళ్లిపోయింది శ్రీల.

ఆ అమ్మాయికి ఏడుపు తన్నుకు రాసాగింది.

ప్రోత్సహించకపోతే పోయాడు. అంత వ్యంగ్యంగా, నీచంగా మాట్లాడ్తాడేం?

ఇప్పుడే కాదు తను ఊరి మొత్తంలోని పాఠశాలల్లోని విద్యార్థినులకి జరిగిన పరుగు పందాల పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి తెచ్చుకుని తండ్రి ఆశీస్సుల్నీ పీటీ సర్ ఆశీసుల్ని అందుకున్నరోజున కూడా ఇలాగే మాట్లాడాడు.

ఇప్పుడు అంతర్రాష్ట్రీయ పోటీల స్థాయిలో పాల్గొనేందుకు తను సెలెక్టు అయిందని చెప్తే ఇలా అంటున్నాడు. ఈ మధ్యలో తను అందుకున్న ఎన్నెన్నో ప్రైజుల్నీ, ప్రశంసల్నీ అతను పట్టించుకోలేదు. పెదవి విరిచేస్తూ వచ్చాడు.

తను ఎదగడం అతనికి ఇష్టంలేదా? లేక ఈ రంగంలో ఎదగడం అతనికి అయిష్టంగా ఉందా?

అర్థం కాలేదామెకి.

కానీ ఆరోజున ఆకలేయలేదు. కంటిమీదికి కునుకూ రాలేదు.

మర్నాడు ప్రొద్దున పనిమనిషి వచ్చినప్పుడు చెప్పింది రుక్మిణికి శ్రవణ్ కి బాగా జ్వరం వచ్చింది అని!

ఆ మాట కూతురికి చేరవేసింది రుక్మిణి.

''వెళ్తాలే'' అనేసిందే కానీ వెళ్లలేదు.


తల్లీ, తండ్రీ చూసొచ్చారు. 'ఇంకా వెళ్లకపోతే బాగుండదు. ఎంతైనా కాబోయే మొగుడాయె. పైగా అతను మూసిన కన్ను తెరవకుండా పడివున్నాడు' అన్నారు.

ఇంక తప్పదనుకుని బయల్దేరింది.

మేనత్త ఇల్లు సమీపించేసరికి ఆమె మనసులో తనకి తెలీకుండానే తీయటి ఊహలు తలెత్తసాగాయి.

ఎప్పుడూ అలాగే జరుగుతుంది.

ఎందుకో మరి!



అది తన సామ్రాజ్యంలాగ ఆ సామ్రాజ్యానికి తను పట్టపురాణిగా తోస్తుంది.
గబగబా లోపలికి నడిచింది.

శ్రవణ్ కాళ్లు పడుతూ కూర్చునుంది పార్వతి. శ్రవణ్ సరే సరి!
మూసిన కన్ను తెరవకుండా పడివున్నాడు.

''ఎలా ఉందత్తయ్యా శ్రవణ్ కి?'' ఆదుర్దాగా అడిగింది.
''ఏమీ బాలేదమ్మా'' అంది పార్వతి
శ్రీల శ్రవణ్ మంచం పక్కకి వచ్చింది.
పార్వతి వెంటనే ఏదో పని ఉన్నట్టుగా లోపలికి వెళ్లిపోయింది.
''శ్రవణ్ !'' పిలుస్తూ అతని నుదుటిమీద చెయ్యి వేసింది శ్రీల.
చుర్రుమంటోంది నుదురు.
తక్కున చేతిని వెనక్కి లాగేసుకుంది శ్రీల.
నిద్రలో కలవరించాడు శ్రవణ్ 'శ్రీ' అని! శ్రీల కళ్లల్లో నీళ్ల తిరిగాయి.
'పాపం అంత జర్వ తీవ్రతలో కూడా అతని మదిలో తనే ఉంది. కానీ తను అతనిమీద కోపంతో ఇక్కడికి రాకూడదని' అనుకుంటూ వచ్చిందివ్వటిదాకా!

కన్నీళ్ళు రాల్తూనే వున్నాయి.
అలా అతని దగ్గర కూర్చున్న శ్రీల జ్వరం పూర్తిగా తగ్గేదాకా శ్రవణ్ సేవల్లోనే మునిగి వుంది.
అతను లేచి కూర్చున్ననాడు తన కాళ్ళు ఇప్పటికి స్వాధీనంలోకొచ్చిన భావన కలిగింది.
అతను పథ్యం తిన్ననాడే శ్రీలకి నిజంగా ఆకలి కలిగింది.
''ఇంకొంచెం బీరకాయ కూర వెయ్యి అత్తయ్యా బాగా ఆకలిగా ఉంది'' అంది.
పార్వతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.
ఇన్నాళ్లనుండీ ఆకలి అన్నదాన్ని గురించే మర్చిపోయింది శ్రీల. ఇవాళ పాపం నోటికి రుచి, కడుపుకి ఆకలి కలిగినట్లున్నాయి అనుకుంది.
శ్రీలకి కూరవేస్తూ అంది పార్వతి.
''ఇదిగో శ్రీలా! ఇంక నువ్వీ ఇంటికి వచ్చెయ్యాలమ్మా! ఒక్కదాన్నీ దేవుళ్ళాడడం కష్టంగా ఉంది. మీ మామయ్య ఓ రకమైతే బావ మరో రకం''
శ్రీల చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. ఓరగా శ్రవణ్ వైపు చూసింది.
చారూ అన్నం తింటున్న శ్రవణ్ కొంటెగా నవ్వాడు.
ఎందుకో ఆ మాటతో ఇంక అన్నం తినాలని అనిపించనేలేదు ఆ అమ్మాయికి.
పెళ్లి జీవితంలో ఓ భాగం మాత్రమే అనేస్తారు కొందరు తేలిగా.
కానీ కాదు.
పెళ్ళికున్న ప్రాముఖ్యతే వేరు.
నా అనుకుంటూ వచ్చిన మనిషితోనే పెళ్ళయితే ఇంక ఆ ఆనందం గురించి చెప్పనే వద్దు.

చటుక్కున తన కంచం తీసేసింది శ్రీల.

''అయ్యయ్యో అప్పుడే లేచావేమిటే?''

''కడుపునిండిపోయిందత్తయ్యో''

కంచం సింకులో పడేసింది.

చెయ్యి, మూతి కడిగేసుకుంది.

పరుగులాంటి నడకతో సాగిపోయింది.

కానీ... ఇంటికెళ్లాలనిపించలేదు.

లైబ్రరీవైపుకు వెళ్లింది.

ఏదో ఓ పుస్తకం పట్టుకుని కూర్చుంది.

కానీ ఆ పుస్తకంలో అక్షరాలేవీ కనిపించడంలేదు. నవ్వుతున్న శ్రవణ్ ముఖమే అందులో కనిపిస్తోంది.

'శ్రవణ్ !'

'నా మనసు, తనువు అన్నీ నీకే నైవేద్యం!

త్వరగా నన్ను నీదాన్ని చేసేసుకో' అంది మనసులోని తలపు గుసగుసగా!

చాలా సేపటిదాకా లైబ్రరీలోనే గడిపి ఇంటివైపుకు వెళ్లింది.


''రా...రా నీకోసమే ఎదురుచూస్తున్నాను'' అన్నాడు కృష్ణమూర్తి.

''దేనికి నాన్నా?'' అడిగింది శ్రీల ఇంకా కలల లోకంలోనే తేలిపోతూ!

ఆ మాటైతే అడిగింది కానీ 'నీకా పెళ్ళికి ముహూర్తం పెట్టించాను' అని తండ్రి అని ఉంటే తనకి ఎంత సిగ్గుగా ఉంటుంది.

కళ్ళు పైకెత్తి నాన్నవైపు చూడగలదా?

## రికార్డ్!




మీరు ఎన్నో రికార్డుల గురించి చదివి ఉండవచ్చు! కానీ ఇపుడు మీరు చదవబోయే రికార్డు మాత్రం ఖచ్చితంగా అరుదైనదే! అతడి పేరు రాజగోపాల్ భండారి! కలకత్తాకు చెందిన ఈ వ్యక్తి అయిదు పైసల కోసం కలకత్తా ట్రామ్ కంపెనీతో ఏడాదిపాటు పోట్లాడాడు! చివరికెలాగైతేనేం... అయిదు పైసల్నీ సాధించాడు! ప్రపంచంలో గవర్నమెంటు సంస్థ నుంచి ఇంత తక్కువ మొత్తం 'రిఫండ్'గా పొందటం రికార్డు కావటంతో భండారి ఎంచక్కా గిన్నీస్ రికార్డుల పుస్తకంలోకి ఎక్కేస్తున్నాడు — కంగ్రాట్స్!

—జూపిటర్

'ఫో నాన్నా' అని పారిపోవడానికి ఇదేమైనా సినిమానా? తండ్రి జవాబు చెప్పేలోగానే మనసు అన్నన్ని ఆలోచనలు చేసేసింది.

"నిన్ను ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్‌వారి స్పోర్ట్స్ హాస్టల్లో చేర్పిద్దామనుకుంటున్నాన మ్మా"

శ్రీల వాస్తవానికి వచ్చేసింది ఆ ఒక్కమాటతో!

"...."

"మాట్లాడవేంటి శ్రీలా నీకిష్టంలేదా?"

"ఆడపిల్లకి అవన్నీ ఎందుకండీ? హాయిగా శ్రవణ్ కిచ్చి పెళ్లి చేసేద్దాం. మన కళ్ళ ఎదురుగానే కళకళలాడుతూ తిరుగుతుంది" అంది రుక్మిణి.

"అలా అనద్దు రుక్మిణీ అలా అనడం అన్యాయం"

"ఆడపిల్ల పెళ్లి చేసుకుంటే సుఖపడుతుంది అనడం అన్యాయమా?"

"అవును! టాలెంట్ ఉండి దేశంలోనే నెంబర్‌వన్‌గా రాబోయే క్రీడాకారిణిని పెళ్లి పెటాకులూ అంటూ బంధించెయ్యడం అన్యాయమే!"

"ఒక్కగానొక్క పిల్లండీ మనకి! ఆ ఉన్నదాన్నే హాస్టళ్లలో పెట్టేస్తానంటారేం?"

"ఈ ఒక్కగానొక్క పిల్లే మనకి బ్రహ్మాండమైన పేరు ప్రతిష్ఠలు తెస్తుంది రుక్మిణీ మనకే కాదు దేశానికే గర్వకారణమవుతుంది కూడా!"

"సరే ఇప్పుడు అంతర్రాష్ట్రీయ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్ళాలేమో!"

"వెళ్తుంది. బహుమతిని తెచ్చుకుంటుంది. అది సరే కానీ పీటీ సర్‌ని కలవలేదేమ్మా ఈ మధ్య! ప్రాక్టీస్ మానేస్తే ఎలా?"

"శ్రవణ్ కి జ్వరం వచ్చింది కదా నాన్నా!"

"అవుననుకో...."

"ఇప్పుడోసారి పీటీ సర్‌ని కలుసుకుని వస్తాను."

"రేపు వెళ్ళవచ్చులేవే!" అంది రుక్మిణి

"కాదమ్మా ఇప్పుడే వెళ్ళాలి" బయటికి పరిగెత్తింది శ్రీల.

పీటీ సర్‌ని కలవడమూ ఆ తర్వాత పరుగుల ప్రపంచంలోకి వెళ్లినట్లుగా ఫీలైపోవడమూ జరిగింది.

ఆ ప్రపంచంలో ఉంటే ఆమెకి శ్రవణేలని ఏమిటి ఆకలి, నిద్రలే గుర్తురావు.

పరిగెత్తాలి. పరిగెత్తాలి.

ఇంకా ఇంకా పరిగెత్తాలి.

కుందేలు పిల్లలాగా పరిగెత్తాలి.

కాదు కాదు చిరుతపులిలాగ దూసుకుపోవాలి.

అదే ఆమె ఆలోచన.

అదొక్కటే ఆమె గమ్యం!

ఈ మధ్యలో ఒకటి రెండుసార్లు శ్రవణ్ ని చూడడానికి వెళ్ళింది కానీ ఆ వేళల్లో అతను నిద్రలో ఉండడంతో లేపకుండా తిరిగి వచ్చేసింది.

అంత జ్వరం వచ్చి తగ్గింది కనక రెస్టు బాగా కావాలి అనుకుంది కూడా!

బలవర్ధకమైన ఆహారాన్ని తినిపించడమూ, అలిసిపోయి పక్కవిూదికి చేరిన కూతురి కాళ్లకి నూనె రాసి మసాజ్ చేయడమూ రుక్మిణి వంతు.

ఆమెని అనుక్షణం ప్రోత్సాహపరుస్తూ ఉండడం ఆటల్లో ప్రప్రథమంగా ఏయే మహిళలు ఉంటూ వచ్చారో, ఎంతెంత కృషి చేసాక వారు ఎలా కష్టపడి అంత స్థాయికి వచ్చారో వర్ణించడం, నువ్వు నెంబర్ వన్‌గానే నిన్ను ఊహించుకో అంటూ పదే పదే చెప్పడం కృష్ణమూర్తి వంతు.

కూతురికి పోటీ ఉన్నరోజున అన్ని పన్లూ మానుకుని తప్పనిసరిగా హాజరవుతాడు కృష్ణమూర్తి.

ఆమె ఎక్కడికెళ్ళినా ఎస్కార్ట్‌లాగ వెన్నంటే ఉంటాడు.


కృష్ణమూర్తే శ్రీలకి స్ఫూర్తి.

ఆ మాట ఆయనకీ తెలుసు.

* * * *

శ్రీల తండ్రితో కలిపి బెంగుళూర్ వెళ్ళిపోయింది.

బెంగుళూర్ రైల్ ఎక్కినప్పటినుండీ ఆమెకి ఒకటే ఆలోచన.



తను ఎలాగైనా సరే ఫస్ట్‌గా రావాలన్నదే ఆ ఆలోచన.
అదీ తన కోసం కాదు తన తండ్రి కోసం అన్నది ఆమె ఉద్దేశం.
బహుమతిని అందుకుంటే ఆనందం కలిగే మాట నిజమే!
కానీ తనకి బహుమతి వచ్చిందనగానే తండ్రి కళ్లల్లో కనిపించే ఆనందం, తను ఆ బహుమానాన్ని అందుకుంటుంటే ఆయన కళ్లు మెరిసే విధానం చూస్తుంటే తనకింకా ఎంతో ఆనందం కలుగుతుంది అనుకుంది శ్రీల.
ప్రయాణం పూర్తికాగానే తమ కోసం ఎరేంజ్ చేసిన బసకి చేరారు.
"నువ్వు ఏం కావాలంటే అది తినేసి హాయిగా నిద్రపో! నేనూ పీటీ సర్ వెళ్లి మిగతా సంగతులు చూసుకుంటాం" అన్నాడు కృష్ణమూర్తి.
వాళ్ళు కేవలం కాఫీలు తాగి గబగబా వెళ్లిపోయారు.
హాయిగా నిద్రపోయింది కడుపు నింపుకున్నాక శ్రీల.
ఆ మర్నాడు పోటీ జరిగింది.
పీటీ సర్, కృష్ణమూర్తి ఊహించినట్లే శ్రీలకి మొదటి స్థానం లభించింది.
శ్రీల బహుమతి అందుకుంది.
కెమెరాలు క్లిక్‌మన్నాయి..
వీడియో కెమెరా చిత్రీకరించింది.

ప్రెస్ రిపోర్టర్లు ఆ విషయాన్ని నోట్ చేసుకున్నారు.
కృష్ణమూర్తి కూతురితోను, పీటీ సర్‌తోను కలిసి బెంగుళూర్ చూసాడు.
శ్రీల సరదా పడ్తోందని ఊరు చూసే కార్యక్రమానికి ఒప్పుకున్నాడు కానీ ఎప్పుడెప్పుడు ఊరెళ్లి అందరికీ ఈ సంగతి చెప్పాలా అని ఉవ్విళ్లూర్తున్నాడతను.
శాండల్ ఫుడ్ వస్తువులు బోలెడు కొంది శ్రీల.
ఊరికి రాగానే కనీసం మంచినీళ్ళయినా తాగకుండానే మేనత్త ఇంటివైపుకు పరిగెత్తింది.
శ్రవణ్ సస్పెన్స్ థ్రిల్లర్ నవలేదో చదువుతూ నడుము వాల్చి ఉన్నాడు.
"హాయ్ శ్రవణ్" అంది శ్రీల.
తలెత్తాడు శ్రవణ్.
"హాయ్!" అన్నాడు పొడిగా!
నీ కోసం ఏం తెచ్చానో చూడు" అంటూ అతని చేతికి అందించింది శ్రీల.
అతను ఆత్రంగా ఆ పొట్లం విప్పలేదు.
థాంక్స్ అంటూ నవ్వనైనా లేదు.
"ఎక్కడినుండి తెచ్చావు?" అని అడిగాడు.

''బెంగుళూర్ నుండి?''
''ఎప్పుడు వెళ్ళావ్?''
''నాలుగురోజుల క్రితం వెళ్ళాను.''
''ఓహో!''
''నీకు చెప్పడానికి వచ్చాను శ్రవణ్! కానీ నువ్వు నిద్రపోతున్నావు!''
''......''
''రెండుసార్లు వచ్చాను. రెండుసార్లూ నిద్రలోనే వున్నావు.''
''రెండోసారి నిజంగా నిద్రపోలేదు నేను'' ఉక్రోషంగా అన్నాడు శ్రవణ్
''అమ్మ దొంగా! నా దగ్గర నటిస్తున్నావు కూడానా?''
''నీ ఆటల్లో పడి నువ్వు నన్ను ఆడించడంలేదా?''
''ఎస్! ఆడిస్తాను. పాడిస్తాను. ఏం చేసినా నా ఇష్టం'' కొంటెగా నవ్వుతూ అంది శ్రీల.
''నేను చాలా కోపంగా ఉన్నాను శ్రీలా! నన్ను మాట్లాడించకు.''
''కోపం పోగొట్టవలసింది నేనే సర్!'' అంది అతని పక్కనే తనూ కూర్చుంటూ!

శ్రవణ్ శరీరం జల్లుమంది.
''నా మీద కోపమేంటి శ్రవణ్!'' నెమ్మదిగా అంది శ్రీల.
''మరేముందలో!''
''నీ కళ్ళల్లో ఇప్పుడు కురిపిస్తున్నాలంటే అనురాగమే ఉండాలి''
శ్రవణ్ శ్రీల చేతిని అందుకున్నాడు.

## ఐదు గంటలు!



టీచర్ నానీని చురుగ్గా ప్రశ్నించాడు ''ఒరే నానీ... నాలుగూ ముప్పై నిముషాలకు మరో ముప్పై నిముషాలు కలిపితే ఏమవుతుందిరా?''

''లాంగ్‌బెల్ అవుతుంది టీచర్!'' ఆనందంగా చెప్పాడు నాని.

-గొంట్లు శ్రీనివాస్ (కడెమి)

"శ్రీ!"

"ఊఁ"

"నువ్వు లేకపోతే పిచ్చెక్కినంత పనైంది తెల్సా?"

"...."

"మాట్లాడవేం?"

"హాయిగా వింటున్నాను. ఇంకా ఏమైనా చెప్పు"

"ఇంకా చెప్పనా?"

"ఊఁ!"

"నిజంగానే!"

"నిజంగా!"

అతను ఆమె చేతిని పెదవికి ఆనించుకున్నాడు.

"నువ్వు పక్కనే ఇలా తగుల్తూ కూర్చున్నా పిచ్చెక్కినట్టే ఉంది నాకు"

"ఛా" చటుక్కున లేచింది శ్రీల.

"ప్లీజ్ శ్రీలా వెళ్ళిపోకు! నేను ముట్టుకోనులే? నువ్వు నా ఎదురుగుండా కూర్చున్నా చాలు. కడుపు నిండిపోయినట్లుగా ఉంటుంది"

శ్రీల కూర్చుంది. అతని ఎదురుగా కాదు. పక్కనే కూర్చుంది.

"బాగా చిక్కిపోయావు శ్రవణ్!" అంది అతని జుట్టు వేళ్ళతో దువ్వుతూ!

"నువ్వు ఇంక ఇక్కడే ఉండిపోయే రోజు వచ్చేస్తోందిగా ఇంక బ్రహ్మాండంగా ఉంటాను"

"....."

"వింటున్నావా?"

"వింటున్నాను. అన్నట్టు శ్రవణ్ బెంగుళూర్లో ఎలా జరిగిందో అడగవేం?"

శ్రవణ్ ముఖంలో కనీ కనిపించని అయిష్టత ద్యోతకమైంది. కానీ ఉత్సాహంగా ఉన్న శ్రీల అది గమనించలేదు.

"నేనే మొదటిస్థానాన్ని అందుకున్నాను శ్రవణ్!"

"కంగ్రాట్స్!"

"టీవీలో కూడా నెక్స్ట్ వీక్ చూపిస్తారుట"

"అవునా?"

"ఇంక వెళ్తాను శ్రవణ్! పాపం అమ్మకి నేనేమీ చెప్పలేదు. నీకే ముందు చెప్పాలని పరిగెత్తుకుంటూ వచ్చాను" శ్రీల గబగబా వెళ్ళిపోయింది.


శ్రవణ్ అలాగే కూర్చుండిపోయాడు.

శ్రీల అంటే తనకి చాలా ఇష్టం.

ఆమె మాట వినాలన్నా, నవ్వుముఖం చూడాలన్నా ఎంతో ఎంతెంతో ఇష్టం.
వేరే ఏ ఆడదీ శ్రీల అందంముందు సరిపోదు అనిపిస్తుంది తన కళ్ళకి!
కానీ... ఆమెని క్రీడాకారిణిగా తాను ఊహించలేకపోతున్నాడు.
ఆమె ఎక్కడ ఆడుతున్నా అక్కడికి తను వెళ్ళడం లేదు.
కనీసం అక్కడ జరిగిన సంగతులైనా ఉత్సాహంగా వినడం లేదు.
ఆ మాట తప్ప ఇంకేమ్మాటైనా శ్రీల మాట్లాడ్తే బాగుండునని అనిపిస్తుంది.
కానీ ఆ విషయం డైరెక్ట్‌గా చెప్పలేకపోతున్నాడు.
చెప్తే తనకి దూరమైపోతుందని భయం!
శ్రీలని తను ప్రాణంతో సమానంగా ప్రేమిస్తున్నాడు.
కానీ ఆమె క్రీడాకారిణిగా ఉండటాన్ని మాత్రం తను భరించలేదు.
దానికి కారణం జెలసీయా?
లేక పొట్టిపొట్టి లాగూలూ స్లీవ్‌లెస్ టీషర్ట్స్ వేసుకుని పదిమంది ఎదుటా పరుగెత్తడం ఇష్టం లేకపోడమా?
ఆటల్లో పడి తనని అలక్ష్యం చేస్తుందన్న ఫీలింగ్ రావడమా?

ఏమో!
ఏమైనా కావచ్చు.
కానీ ఈ తన భావాలను ఎప్పుడూ ఎవ్వరిముందూ బహిర్గతం చెయ్యడు.
కానీ ఆమెనీ వదులుకోడు.
ఎస్!

## వివాహాల వినువీధి!



బొంబాయిలోని 'అనంత్ కనేకర్ మార్గ్' లాంటి స్థలంలో పెళ్ళిళ్ళు జరిపించగల అనేక కార్యాలయాలు వెలిశాయి. ఈ వివాహ కార్యాలయాలలో పెళ్ళిళ్ళు హిందువులకి, ముస్లింలకి, క్రైస్తవులకి కూడా జరిపించబడుతుంటాయి. మత ప్రమేయం లేని ఈ కార్యాలయాలు వధూవరులు కోరినపద్ధతిలోనే పెళ్ళిళ్ళు చేయిస్తారు. వివాహానంతరం వీరికి పెళ్ళయినట్లు సర్టిఫికేట్లు రిజిస్ట్రార్ ఆఫీసు నుండి సంపాదించిపెడతారు. ఇక్కడ పెళ్ళిళ్ళ ఖర్చు రూ.1500 నుండి రూ.6000 వరకు ఉంటుంది.

—ప్రసాదారి

శ్రీలని తను వదులుకోలేదు.
ఆమె తన కోసమే పుట్టింది.
కానీ శ్రీల క్రీడాకారిణిగా వెలుగొందడానికి వీల్లేదు.
ఆమె మిసెస్‌గా శ్రవణ్‌గా మిగిలిపోయి తీరాలి
అందుకోసం తనేమైనా చేస్తాడు.
చేసి తీర్తాడు. అనుకుంటూ శ్రీల ఇచ్చిన ప్యాక్ తెరిచాడు.
శాండల్‌వుడ్ రాధాకృష్ణుల విగ్రహం అది!
అయితే ఆ విగ్రహం లోని రాధాకృష్ణులు ఆలింగనం చేసుకుంటూలేరు.
కృష్ణుడు మురళిని వాయిస్తున్నాడు.
రాధ కృష్ణుని పాదాలమీద దోసిలినిండుగా ఉన్న పూలను పోస్తోంది.
శ్రవణ్‌కి అది చాలా నచ్చింది.
ఆ విగ్రహంలో కృష్ణుడు తను, రాధ శ్రీల లాగా తోచిందతనికి.
ప్రతీ మగాడు రాధలాంటి ప్రేమైక మూర్తినో, రుక్మిణిలాంటి ఉత్తమ ఇల్లాలినో, సీతలాంటి సహన శీలినో ఆలిగా కోరుకుంటారు.
సత్యభామలాంటి దాన్ని శ్రీకృష్ణుడు పరమాత్ముడు కనక భరించాడు.
ద్రౌపదిని పంచపాండవులు కనక భరించారు.
కానీ సగటు మానవుడు మాత్రం రణరంగానికి ఉరికేదాన్ని ఎంత అలకలోనైనా తన్నేదాన్ని రోషావేషాలు అభిమానధనమూ కలిగి పగ చల్లారేదాకా సిగముడవనన్న స్త్రీనీ ఆ రకమైన బ్రాండ్‌నీ భరించలేదు అనుకున్నాడు శ్రవణ్.

* * *

శ్రీల ప్రైవేటుగా కాలేజీ చదువు చదవచ్చు అనుకుంటూ తండ్రి మాట ప్రకారమే స్పోర్ట్సు హాస్టల్‌లో చేరింది.
శ్రవణ్ తన ప్రేమ పాశంతో ఆమెని బంధించి ఉంచాలని ప్రయత్నించి విఫలమయ్యాడు.
శ్రీల రకరకాల పరుగు పందాలను అభ్యాసం చేసింది.
అక్కడి కోచ్ అర్ముగం దృష్టిని ఆకర్షించింది శ్రీల.
"నీకు చాలా భవిష్యత్తు ఉంది" అన్నాడాయన.
నవ్వి ఊరుకుంది శ్రీల.
"నువ్వు 100 మీటర్లు 200 మీటర్లు పరుగు పందాల్లో మన దేశానికి బోలెడు పేరు తీసుకువస్తావు. నిన్నింకా సాన పడ్తాను" అన్నాడు.




శ్రీల అంతమంది విద్యార్థినుల మధ్య ఉన్నా ఆర్ముగం స్పెషల్‌గా కోచింగ్ ఇవ్వసాగాడామెకి.

ఫిజికల్‌గానే కాదు సైకలాజికల్‌గా కూడా శ్రీలని ఫిట్‌గా చేసాడు ఆర్ముగం.

కార్ల్‌లూయిస్ గురించి ఎంతో చెప్పేవాడు.

యుఎస్ఎలోని విల్లింగ్ బార్‌లో పుట్టాడు. తండ్రి స్ప్రింటర్. తల్లి లాంగ్‌జంపర్. అతని తన్నదమ్ములూ స్పోర్ట్స్‌లైన్‌లో ఉన్నవాళ్ళే.

అతని అన్న 1968లో 29 ఫీట్ టూ అండ్ హాఫ్ ఇంచెస్ జంప్‌చేసి ఒలింపిక్స్‌లో సెన్సేషన్ క్రియేట్ చేసినప్పుడు లూయిస్ వయస్సు ఏడేళ్ళు.

కానీ అప్పుడే అతను అన్నని చూసి ఎంతో ఇన్‌స్పయిర్ అయ్యాడు.

తమ ఇంట్లో దొడ్డివైపున ఇసుకలో జంపింగ్ ప్రాక్టీస్ చేస్తూ ఉండేవాడు.

ఆ ప్రాక్టీస్ ఎంతో విగరస్‌గా ఉండేది.

దాని ఫలితాన్ని అతను త్వరలోనే చూశాడు.

26 అడుగుల ఎత్తుకి దూకి అమెరికన్ అబ్బాయిల రికార్డుని మూడుసార్లు బ్రేక్ చేశాడు.

ఇరవై ఏళ్ళ వయస్సులోనే 100 మీటర్లలోనూ, లాంగ్‌జంప్‌లోనూ నెంబర్‌వన్‌గా వచ్చాడు.

1983లో 100–200 మీటర్ల పరుగుల్లోనూ, లాంగ్‌జంప్‌లోనూ ఫస్ట్‌గా రావడమే కాదు సెంచరీ మొత్తంలోనూ మూడు రంగాల్లో ముందున్న వ్యక్తిగా అతనే పేరుగాంచాడు.

అంత గొప్ప క్రీడాకారుడైన కార్ల్ లూయిస్ సడెన్‌గా అన్‌పాప్యులర్ కావడం మొదలుపెట్టాడు.

తన గొప్పలు చెప్పుకోవడం, డ్రగ్స్ వాడ్తారు అంటూ తోటి ఆడగాళ్ళను కామెంట్ చెయ్యడం మొదలుపెట్టాడు.

ఎవరితోనూ కలవడం మానేశాడు.

దాంతో స్నేహితులే లేకపోయారు.

అతను చాలామంది ఆడవాళ్ళతో తిరుగుతాడని పుకార్లు అధికమైనాయి.

మైకేల్ జాక్సన్, జెస్సీ ఓవెన్స్‌లకంటే తానే ఎంతో అధికుడనని చెప్పుకోసాగాడు.

కానీ త్వరగానే ఆ లక్షణాలు పోగొట్టుకున్నాడు. కనక మళ్ళీ రాణించాడు.

ఒకే ఒలింపిక్స్‌లో నాలుగు బంగారు పతకాలు పొందాడితను.

ఇతన్ని ఆదర్శంగా తీసుకుంటే అద్భుతంగా రాణిస్తావు శ్రీలా!''

స్త్రీలలో ఉన్న క్రీడాకారులని ఆదర్శంగా తీసుకోవద్దా సర్?''

రాణించిన వాళ్ళెవ్వరినైనా ఆదర్శంగా తీసుకోవచ్చు. కానీ స్త్రీ, పురుషుడు అని ఏ రంగంలోనూ విభజించకూడదు. నేను స్త్రీని కనక నా లిమిటేషన్ ఇంతే! అని అనుకోకూడదు.

ఉత్తమోత్తమంగా ఎదిగిన లూయిస్‌ని ఆదర్శంగా తీసుకుంటే నువ్వు అలాగే ఎదుగుతావు.

తల ఊపింది శ్రీల.

"నువ్వు ఆంధ్రాలో ముందుగా ఉన్నానని అల్పసంతోషివి కాకూడదు. ప్రపంచంలో ముందుండేలాగ చూసుకోవాలి.

ఎవరి గురించీ ఆలోచించవద్దు. నీ ఆటలమీద తప్ప దేనిమీదా మనసుని కేంద్రీకృతం కానివ్వకు.

శ్రీల పూర్తిగా ఆర్ముగం మాటలను వింది.

ఇంటికి పెద్దగా ఉత్తరాలు రాయడం మానేసింది. శ్రవణ్ ని గురించీ ఆలోచించడం లేదు.

ఆడడం, ఆడడం, ఆడడం!

అదే పని!

అదొక్కటే పని!

* * *


"హలో శ్రీలా"

"హలో!"

"ఆటేమా క్రీడలకి వెళ్ళక తప్పదా!?"

"అలా అంటావేంటి శ్రవణ్!"

మరెలా అనమ శ్రీలా? నిన్నుచూసి చాలా రోజులైంది. కానీ ఆ ఆనందమైనా మిగల్చకుండా వెళ్ళిపోతున్నావు"



"నీకింకా ఆనందం కలిగించే విషయం కదా నేను రెండు గోల్డ్‌మెడల్స్ సంపాదిస్తే!"

"...."

"అర్థం కాలేదా మొద్దబ్బాయ్! ఆ రెండు బంగారు పతకాలూ నా మెళ్లో కట్టేసి భర్తవన్న లైసెన్స్ తెచ్చుకోవచ్చుగా త్వరగా"

"అవుననుకో!" మంచి మూడ్‌లోకి వస్తూ అన్నాడు శ్రవణ్

"ఆ తర్వాత ఒలింపిక్స్ కింక నాన్నని శ్రమ పెట్టక్కర్లేదు. నువ్వుంటావుగా నాకు నీడగా తోడుగా"

ఉలిక్కిపడ్డాడు శ్రవణ్!

కానీ దాన్ని బయటపడనిచ్చేంత తెలివి తక్కువవాడు కాడతను.

మామూలుగానే శ్రీలతో మాట్లాడాడు.

ఆ తర్వాత శ్రీల కోచ్ ఆర్ముగం తండ్రి కృష్ణమూర్తితో కలిసి ప్రయాణమైంది.

ఏరోడ్రోమ్‌నుండి వచ్చేస్తూ అనుకున్నాడు శ్రవణ్. "ఇది ఆటల్లో నీ ఆఖరు ప్రయాణం కావాలి శ్రీలా! అందుకు నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" అని!

అతను ఆసియా క్రీడల టీవీలో వస్తున్నా చూసే ఆసక్తి కనబర్చడం లేదు.

ముఖ్యంగా శ్రీలని చూడాలని అస్సలు లేదు. కానీ ఆవిషయంలో బయటపడటం ఇష్టం లేదు. కనక ఎంతో ఆసక్తి ఉన్నవాడిలాగా మాట్లాడసాగాడు.

శ్రీల అతనికి చెప్పినట్లే 100మీటర్ల పరుగు పందెంలోనూ, 200 మీటర్ల పరుగు పందెంలోనూ గెల్చి రెండు బంగారు పతకాలు అందుకుంది.

అది చూస్తున్న శ్రవణ్ కి భగభగలాడిపోయింది.

తల్లీ, తండ్రీ, అత్తయ్యలకంటే తనే ఎంతో ఆనందపడిపోతున్నట్లుగా నటించడానికి అతను చాలా కష్టపడ్డాడు.

ఆరోజు రాత్రి అతనికి నిద్రపట్టలేదు.

దానికి కారణాలు రెండు.

ఒకటి శ్రీలని ఈ ఆటలనుండి ఎలా దూరం చెయ్యాలా అన్న ఆలోచన.

రెండు శ్రీల మొగుడిగానే తప్ప శ్రవణ్ గా నువ్వు సున్నావిరా అన్న ఫ్రెండ్స్ మాటలు గుర్తుకురావడం వల్ల!

శ్రీల వచ్చాక ఆ అమ్మాయితో ఎలా ప్రవర్తించాలి అని చాలా రిహార్సల్ చేసుకుంటూ ఉండిపోయాడు.

మర్నాడు నిద్రలేస్తూనే అయినవాళ్లందరికీ ఫోన్లు చేశాడు శ్రీల రెండు బంగారు పతకాలు గెల్చుకుందని. ఆ సంగతి మీరు టీవీలో చూసేవుంటారు. ఒలింపిక్స్‌లో ఆమె ఇంకా అద్భుతంగా ఆడుతుందని మేమంతా ఆశిస్తున్నాం" అంటూ చెప్పుకుపోయాడు.

శ్రీలని గురించి గొప్పలు తన స్నేహితులందరి ఇళ్ళల్లోనూ చెప్పాడు.
ఆ మాటలు విని వాళ్ళు ఎంత కుళ్ళు జోకులేసినా భరించాడు.
శ్రీల కోసం బోలెడు గిఫ్టులు కొన్నాడు.
శ్రీల రాగానే దిష్టితీయాలని రుక్మిణికి పదేపదే చెప్పాడు.
ఆమె కోసం పెద్దఎత్తున సన్మాన ఏర్పాట్లు తనే ముందుగా చేశాడు.
ఏరోడ్రోమ్‌లోనే ఆమెకి ఆమె అంత ఎత్తున్న పూవుల దండ వేశాడు.
నలుగురిమధ్యా శ్రీలఉన్నా ఆమె అరచేతిని ముద్దాడాడు. అనుకునే నడవసాగాడు.
ఆసియా క్రీడోత్సవాల గురించి ఎంతో ఉత్సాహంగా అడగసాగాడు.
శ్రవణ్ లోని మార్పుచూసి శ్రీల చాలా సంతోషించింది.
అతనిచ్చిన గిఫ్టులన్నీ ఎంతో అపురూపంగా అందుకుంది.
శ్రీలకిప్పుడు తీరిక లేనన్ని సన్మానాలు జరుగుతున్నాయి.
మారుతీకారు అలాంటి ఖరీదైన ఇంకెన్నో గిఫ్టులూ లభించాయి.
బంగారంలాంటి ప్రభుత్వ ఉద్యోగమూ వచ్చింది.
''ఇంక పెళ్ళి జరిపించేద్దామండీ'' అంది రుక్మిణి.
''ఇప్పుడు పెళ్ళేమిటి రుక్మిణీ?''
''మరెప్పుడండీ?''
''ఒలింపిక్స్ అయ్యాక!''
''అదవ్వడానికింకా టైమ్ చాలా ఉందిగా''
''ఆలోగా బాగా ప్రాక్టీస్ చెయ్యొద్దూ?''
రుక్మిణికి విసుగేసి ఊరుకుంది.

## కోరిక!



ప్రేమగా అడుగుతున్న భార్యతో మరింత ప్రేమగా అన్నాడు భర్త ''సాయంత్రం ఆఫీసు నుంచి త్వరగా వస్తాలే...''

''కాదు. ఆలస్యంగా రండి. పక్కింటావిడతో కలిసి సినిమాకెళ్తున్నా!''

''...!?!''

—ఎం.వి.కిరణ్‌కుమార్ (విజయవాడ)

శ్రవణ్ మాత్రం చాలా ఎంకరేజ్ చేస్తున్నాడు శ్రీలని.

చాలాచోట్లకి ఆమెతో కల్సి వెళ్తున్నాడు కూడా.

ఇంటర్వ్యూల్లో కూడా తన కాబోయే భర్తని గురించి చెప్పసాగింది శ్రీల.

ఒలింపిక్స్ వచ్చేశాయి.

శ్రీల, కృష్ణమూర్తితోనూ, ఆర్ముగంతోనూ కలిసి ఢిల్లీ వెళ్లిపోయింది.

ఢిల్లీని ఒలింపిక్స్ కోసం కొత్త పెళ్ళికూతురిలాగా ముస్తాబు చేశారు.

అన్ని హంగులూ అమర్చారు.

శ్రవణ్ తన వాళ్ళందర్నీ ఆటలు మొదలుపెట్టే సమయానికి ఢిల్లీ తీసుకువెళ్ళాడు.

శ్రీలమీదందరూ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

శ్రీల వందమీటర్ల పరుగులో బంగారు పతకాన్ని, 200 మీటర్ల పరుగులో వెండి పతకాన్ని అందుకుంది.

పతకాలను అందుకుంటూ వచ్చిన ఆమె తండ్రివైపూ, కోచ్‌వైపూ చూసింది.

ఆనందబాష్పాలను రాల్చడానికి సిద్ధంగా ఉన్నాయి. వాళ్ళ కళ్ళు.

ఇద్దరి చేతికీ చెరో పతాకాన్నిచ్చింది శ్రీల.

'మీరిద్దరి సహకారం వల్లే నేనింత ఎదిగాను' అని మనస్ఫూర్తిగా అంటున్నాయి మసకబారిన శ్రీల కళ్ళు.

ఫోటోగ్రాఫర్లు, ప్రెస్ రిపోర్టర్లూ, అభిమానులూ అంతా ఆమెని చుట్టుముట్టేశారు.

తనేం మాట్లాడ్తోందో, ఎవర్తో మాట్లాడ్తోందో తెలీడం లేదు శ్రీలకి.

ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైపోతున్నట్లుగా ఉంది సంతోషం అధికంగా ఉండటంవల్ల.

ఇంతలో మైక్‌లో ప్రకటన వినిపించింది.

"శ్రీలకిచ్చిన మెడల్స్ వాపస్ తీసేసుకోబోతున్నాము"న్నదే ఆ ప్రకటన.

అయోమయంగా తండ్రివైపూ, కోచ్‌వైపూ చూసింది.

ఉత్ప్రేరకాలు (డ్రగ్స్) వాడిందని రుజువు కావడంతో ఆమె పతకాలు వెనక్కి తీసేసుకుంటామని అంతేకాక ఆమెని మూడేళ్ళపాటు ఆటలనుండి బాన్ చేశామని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధ్యక్షుడు అన్నారు.

పతకాలు సాధించేందుకు ఉత్ప్రేరకాలు వాడితే క్రీడా స్ఫూర్తినే అపహాస్యం చేసినట్లవుతుందన్నారాయన.

శ్రీలకేమీ అర్థం కాలేదు.

"తను డ్రగ్స్ తీసుకోవడమేమిటి?" అయోమయంగా ఉందామెకి.

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ దాదాపు వంద ఉత్ప్రేరకాలను నిషేధించిందని, వాటిలో ఏడు ఉత్ప్రేరకాలు ఎంతో ప్రమాదకరమైనవనీ ఒలింపిక్ కమిటీ అధ్యక్షుడు చెప్పుకుపోతు

న్నారు.

శ్రీలకింకేమీ వినిపించలేదు.

ఆమెకి స్పృహ తప్పింది.

* * *

శ్రీలనిప్పుడు కూడా ఎన్నో పత్రికలు ఇంటర్‌వ్యూలు చేస్తున్నాయి.

ఎటొచ్చీ ఆ ఇంటర్వ్యూ చేసే విధానమే వేరుగా ఉంది.

'మీరు డ్రగ్స్ ఎందుకు తీసుకున్నార'నో?

'ఏ డ్రగ్స్ వాడార'నో?

'డ్రగ్స్ వాడకలేకపోతే మీకు కాన్ఫిడెన్స్ లేదా గెలుస్తానని' ఇలా అడ్డదిడ్డంగా అడుగుతున్నారు.

'నేనే డ్రగ్గా తీసుకోలేదని' ఆమె చెప్తున్నా ఎవ్వరూ వినడం లేదు.


'అప్పుడెప్పుడో ఏదో పత్రికలో మీరు డ్రగ్స్ గురించి వివరాలిచ్చారు. అంటే అప్పటినుండి మీకు వీటి సేవనం ఉందా?' అని అడిగాడో విలేకరి.

'డ్రగ్స్ వాడటం, ఆరోగ్యానికి హానికరం. బెన్‌జాన్సన్ అనే స్ప్రింటర్ డ్రగ్స్ వాడటంవల్లే బాన్ వేయబడ్డాడు మూడేళ్ళదాకా.

వీటి వాడకంవల్ల ఆరోగ్యం చెడిపోతుంది, మరణం కూడా సంభవిస్తుంది.

పశ్చిమ జర్మనీ హెప్టాథలాన్ క్రీడాకారిణి బర్గిట్ డ్రెస్సెల్ ప్రాక్టీసు చేస్తూ హఠాత్తుగా స్పృహ కోల్పోయింది.

## సమస్య!



కరీంనగర్ జిల్లా ఉట్నూరుకు చెందిన గట్టయ్యకు 18 సంవత్సరాలే అయినా... విపరీతంగా పొడుగు పెరిగేస్తున్నాడు — ఏడు అడుగుల ఆరు అంగుళాల పొడుగు దాటిన ఇతగాడు ఆసియాలోనే అతి పొడుగైన వ్యక్తిగా నమోదవుతున్న తరుణంలో అతడి కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి అతడ్ని డాక్టర్లకు చూపించారు. పిట్యూటరీ గ్రంథిలో క్యాన్సర్ పుండు ఏర్పడటంవల్ల ఇతడిలా పెరుగుతున్నాడని గ్రహించిన డాక్టర్లు అతడికి ఆపరేషన్ చేయబోతే... అతడికున్న మధుమేహ వ్యాధి... అందుకు అడ్డం వచ్చింది. అతిత్వరలోనే హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో ఈ ఆపరేషన్ జరగబోతోంది. ఆల్ ది బెస్ట్!

—జూపిటర్

ఆ తర్వాత కొద్ది గంటల్లోనే మరణించింది.

బ్లడ్ డోపింగ్‌ను ఐ.ఓ.సి 1985లో నిషేధించింది. అయితే బ్లడ్ డోపింగ్ జరిగిందా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు ఇంతవరకూ ఎటువంటి మార్గమూ దొరకలేదు. అథ్లెట్ తన శరీరంనుంచి ఒక లీటర్ రక్తాన్ని పోటీలకు కొన్ని రోజులముందు బయటికి తీసి ఫ్రిజ్‌లో ఉంచుతాడు. పోటీకి అరగంటముందు ఆ రక్తాన్ని మళ్ళీ తన శరీరంలోకి ఎక్కించుకుంటాడు. దీనివల్ల పోటీలో ఆ అథ్లెట్ ఇతరుల కంటే వేగంగా అలిసిపోకుండా పరుగెత్తగలుగుతాడు.

మాస్కో ఒలింపిక్స్ పరుగు పందాల్లో రజత, కాంస్య పతకాలు సాధించిన కార్లో మానింకా బ్లడ్‌డోపింగ్ వల్లే గెలవగలిగానని బహిరంగంగా ప్రకటించాడు.

అంతర్జాతీయ రంగంలో ఇప్పుడు హెచ్.జి.హెచ్ (హ్యూమన్ గ్రోత్ హార్మోన్) అనే ఉత్ప్రేరకం ప్రాచుర్యంలో ఉంది. హార్మోన్ల కొరత ఉన్న చిన్నపిల్లల కోసం తయారుచేసిన ఈ మందు అథ్లెట్లకు ఏమాత్రం ఉపయోగపడకపోగా ప్రాణాంతకమవుతుందని వైద్యులు చెప్తున్నా గుడ్డిగా క్రీడాకారులు దీన్ని వాడ్తున్నారు. ఇవి వాడడం పూర్తిగా మానేయాలి అని తెలియజేసిన అడ్వర్‌టైజ్‌మెంట్‌లో తనని వాడుకున్నారు అడ్వర్‌టైజ్ చేసినవారు.

ఆ ఇన్ఫర్‌మేషన్ అంతా కూడా వాళ్ళిచ్చిందే! ఆ మాట శ్రీల చెప్పినా ఎవ్వరూ నమ్మి ప్రకటించడం లేదు.

మీరు డ్రగ్స్ తీసుకున్నారని డాక్టర్లు కూడా సర్టిఫై చేసినా ఇంకా ఒప్పుకోరేం!?

సాక్ష్యంగా కూడా ఎందరో ఉన్నారు కదా! అంటున్నారు పత్రికలవాళ్ళు.

ఎవరో తనమీద జెలసీతో ఈ పన్నాగం పన్నారని తెలిసిపోతోంది.

కాసులు కురిపిస్తే ఎన్ని సర్టిఫికెట్లయినా పుట్టించవచ్చని, ఎందరో సాక్షుల్ని తయారుచేసుకోవచ్చనీ తెల్సినా పత్రికలవాళ్ళు తనమీద ఇలా రాయడం అన్యాయంగా తోచింది శ్రీలకి.

తండ్రి, ఆర్ముగం ఆమె డ్రగ్స్ తీసుకోలేదని నిరూపించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

శ్రీల మాత్రం విసిగిపోయింది.

ఈ సమయంలో ఆమెని అహర్నిశలూ కనిపెట్టుకుని ఉంటున్నాడు శ్రవణ్

ఆటల సంగతులు తప్ప మిగతా విషయాలెన్నో మాట్లాడుతున్నాడు.

మంచిమంచి వీడియో కాసెట్లు తెచ్చి చూపిస్తున్నాడు.

రుక్మిణి కృష్ణమూర్తితో గోల మొదలుపెట్టింది.

"ఇంక ఆటలు చాలు. ఇకనైనా పెళ్ళి చెయ్యండి అని!

ఒప్పుకోక తప్పలేదు కృష్ణమూర్తికి.

శ్రీలకి శ్రవణ్‌కి ఘనంగా పెళ్ళి జరిగిపోయింది.

ఇద్దరూ హనీమూన్‌కి వెళ్ళొచ్చారు.

ఈ పదిహేను రోజుల్లో శ్రీల చాలా మారిపోయింది. 'భర్తే ప్రపంచం' అన్నట్లుగా ప్రవర్తించసాగింది.

ఆఫీసుకెళ్ళిన శ్రవణ్ ఎప్పుడొస్తాడా అని ఎదురుచూడటం, అతనొచ్చేవేళకి మంచి టిఫిన్ తయారుచేసి, అతనికిష్టమైన విధంగా ముస్తాబై ఎదురుచూడటం ఆమెకి చాలా ఆనందంగా ఉంది.

శ్రవణ్ గుండెలమీద పడుకుంటే గాని నిద్ర రావడం లేదు.

శ్రవణ్‌ని అనుకుంటే తప్ప కాళ్ళు నడవడం లేదు.

శ్రవణ్ తింటే తప్పఆమె కడుపు నిండటం లేదు.

ఆటలూ, ఎక్సర్‌సైజులూ, ఆటలను గూర్చిన లిటరేచర్ అవన్నీ ఆమెకి ఎంతో దూరమైపోయాయి.

కృష్ణమూర్తి శ్రీలకి ఎంతో నచ్చజెప్పాలని చాలా ప్రయత్నిస్తూనే ఉన్నాడు.

కానీ శ్రీల తండ్రి చెప్పే విషయాలమీద ఆసక్తి చూపడం లేదు.


ఆరోజు శ్రీల చాలా సంతోషంగా ఉంది.

శ్రవణ్ ఇంకా సంతోషంగా ఉన్నాడు.

దానికి కారణం శ్రీల నెల తప్పడమే! పుట్టబోయే పాపాయిని గురించి ఇద్దరూ బోలెడు కలలు కనసాగారు.

బోలెడన్ని సంగతులు మాట్లాడుకోసాగారు.

చంటి పిల్లల పుస్తకాలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చిన పుస్తకాలూ శ్రీల ఎంతో ఇష్టంగా చదవసాగింది.,



శ్రవణ్ క్యాంప్‌కెళ్ళాడు.
అప్పుడు శ్రీల పుట్టింటికొచ్చేసింది.
కృష్ణమూర్తి ఆ సమయాన్ని వదిలిపెట్టలేదు.
శ్రీలని కూర్చోపెట్టి నచ్చచెప్పసాగాడు.
అకారణంగా నీమీద నిందవేశారు డ్రగ్స్ తీసుకుని ఆడావని!
కాదు అని నిరూపించాలని ప్రయత్నించి ఓడిపోయాము.
అలాగని వదిలేస్తున్నావు నువ్వు.
ఆ పని చెయ్యొద్దు.
నెక్స్ట్ జరిగే పోటీలో నీ సత్తా చూపించు.
నువ్వు ఆడు.
గెలు!
ఆ తర్వాత పూర్తిగా క్రీడారంగంనుండి విరమించుకో!
నీమీద పడ్డ నింద పోతుంది. నీకూ ఆత్మవిశ్వాసం ఏర్పడ్తుంది. అంతేకాదు. అప్పుడు నిన్ను ఆక్షేపించిన పత్రికలవాళ్ళే నీ కోసం క్యూలు కట్టే రోజు వస్తుంది. అని ఎంతో ఎంతో చెప్పాడు కృష్ణమూర్తి.
పగలూ, రాత్రీ అన్న తేడా లేకుండా వివరించాడు.
శ్రీల ఒప్పుకుంది.
శ్రవణ్ రాగానే చెప్పేసింది. 'నేను అబార్షన్ చేయించుకుందామనుకుంటున్నాను' అని!
'ఎందుకు?' ఆశ్చర్యంగా అడిగాడతను.
"నేను మళ్ళీ ప్రాక్టీసు చెయ్యాలి!"
"ఏం ప్రాక్టీస్"
"పరిగెత్తడం!"
"డెలివరీ అయ్యాక చెయ్యచ్చుగా!"
"నాకు ఇష్టం లేదు. కొత్త బాధ్యత నన్ను కాన్సన్ట్రేట్ చెయ్యనివ్వదు"
ఎంతో నచ్చచెప్పాలని ప్రయత్నించి ఓడిపోయాడు శ్రవణ్. తప్పనిసరిగా ఒప్పుకున్నాడు.
శ్రీల అబార్షన్ చేయించుకుంది.
మళ్ళీ ఆటలు ఆరంభించింది.
ప్రాక్టీస్ మునుపటికంటే రిగరస్‌గా చేయసాగింది.
శ్రవణ్ ఆమెని ఆ ప్రయత్నంనుండి మాన్పించడానికి ఎంతో ట్రైచేసి ఫెయిల్ అవసాగాడు.

తనకి శ్రీల కావాలి.

కానీ ఇలా కాదు.

జస్ట్ ఇల్లాలిగా మాత్రమే కావాలి.

ఆమెకి తనే లోకం కావాలి.

కానీ అలా అయ్యే లక్షణాలు ఎక్కడా లేవు.

శ్రీల ఆసియా క్రీడోత్సవాల్లో త్వరలో పాల్గొనబోతోంది. కానీ ఇక్కడితో ఆగదు. నెక్స్ట్ ఒలింపిక్స్ అంటుంది. ఆ తర్వాత మరొకటి అంటుంది.

ఆటల్లోంచి ఏ ముప్పయ్యేళ్ళకో రిటైర్ అయినా తను కోరుకునే విధంగా సగటు ఇల్లాలిగా మాత్రం మారదు.

ఇంకేదో రంగం ఎన్నుకుంటుంది.

తిరిగే కాలు తిట్టే నోరు ఊరికే ఉండవు కదా!

కానీ ఇవేవీ తను భరించలేడు.

శ్రీల భర్తగా శ్రవణ్ మిగలకూడదు.

శ్రవణ్ భార్యగా శ్రీల మిగలాలి.

కానీ ఎలా?

ఏం చెయ్యాలి?

ఆలోచిస్తూనే ఉన్నాడు.

శ్రీలని ఆటలకి దూరం చెయ్యాలని అహర్నిశలూ ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు.

కానీ ఏ ప్రయత్నమూ ఫలించడం లేదు.

ఆసియా క్రీడోత్సవాలు ఆరంభమవుతున్నాయి.

శ్రీల ఆడడానికి రెడీగా ఉంది.

ఎల్లుండే ఆమె ప్రయాణం.

శ్రీలకి టెన్షన్‌గా లేదు.

కాన్ఫిడెంటల్‌గా ఉంది.

ఆర్ముగంతో కలిసి ప్రాక్టీస్ చేసుకోవడానికి వెళ్ళింది.

అతను ఆమె స్పీడ్‌ని చూస్తున్నాడు.

ఆమె పరుగెడ్తుంది.

సూర్యుడు కళ్ళు విప్పని వేళ అది.

చుక్కలు నెమ్మదిగా వెళ్ళిపోయే వేళవుతున్న అవి కదలడం లేదు. శ్రీల పరుగుల్ని చూడాలని తాపత్రయపడ్తున్నాయి కాబోలు!

మంచు దట్టంగా పరచుకునుంది.

ఎవ్వరూ కనిపించడం లేదు.

ఆ సమయంలో సరిగా గురిపెట్టి ఆమె ఆగిన క్షణంలోనే కాల్చారెవరో!

శ్రీల కెవ్వుమంది.

నిశ్శబ్దంగా ఉన్న ప్రాంతంలో ఆమె అరుపు మార్మ్రోగింది.

ఆర్ముగం అయోమయంనుండి తేరుకుని ఆమెని ఒళ్ళోకి తీసుకున్నాడు.

ఆ సమయంలో దరిదాపుల్లో ఇంకెవ్వరూ లేరు. శ్రీలకి రక్తం పోతోంది.

ఆర్ముగం గబగబా ఆమెని కార్లో ఎక్కించుకుని ఆసుపత్రికి తీసుకువెళ్ళాడు.

రక్తం ఎక్కించారు.

ఆక్సిజన్ పెట్టారు.

శ్రవణ్ విదేశాలనుండి వచ్చిన డాక్టర్లను సైతం రప్పించాడు.

కానీ శ్రీల దక్కలేదు.

కేసు ఆరంభమైంది.

పుస్తకాలన్నీ హంతకుడ్ని త్వరగా పట్టుకోవాలని రాశాయి.

మహిళా సంఘాలు ధర్నా చేశాయి.

ఆటగాళ్ళంతా ఓ రోజు బంద్ జరిపించారు.

ఏం జరిగినా హంతకుడు దొరకలేదు.

కేసు కొట్టేయబడింది.

ఆటలే ప్రాణంగా భావించి దేశానికి పేరు తేవడానికే పుట్టి ఆడుతూ పాడుతూ పెరిగే ఆటగాళ్ళను

అన్యాయంగా అంతమొందిస్తున్న సంగతి చరిత్రకి కొత్తకాదు.

అమాయుతో అలాంటి హత్యల్ని నానాటికీ పెంచుతూ పోవడం ప్రపంచంలోని పెద్దలంతా గమనిస్తూ ఉన్నా ఏమీ చేయలేకపోతున్నారు.

శ్రవణ్ శ్రీలని చంపేశాడు.

వీలైనంతగా ఆమెలోని క్రీడాకారిణిని చంపేసే ప్రయత్నం చేసాడు.



## కారణం!

ప్రిన్సిపాల్ని ఆసక్తిగా అడిగాడు టీచర్ "ప్యూన్ని డిస్మిస్ చేశారట... ఎందుకని?"

"లాంగ్ బెల్ అర్థగంట ముందు కొడతానని చెప్పి పిల్లలదగ్గర అర్థరూపాయి చొప్పున లంచం గుంజుకుని కూడా బెల్ కొట్టలేదండీ వెధవ!"

—గొంటు శ్రీనివాస్ (కిడిమి)

అది విఫలమయ్యాక హత్యచేయడానికి కూడా వెనుకాడలేదు.
అంటే అసూయ అంతాన్ని చూస్తే కానీ వదిలిపెట్టదన్నమాట.
శ్రీల కథ అలా ముగిసిపోయింది.
రాజకీయ నాయకుల ఇన్‌ఫ్లుయెన్స్‌తో శ్రవణ్ కథ కటకటాల వెనక్కైనా చేరకుండా సజావుగా సాగిపోయింది.
ప్రత్యక్ష సాక్షి అయిన భగవంతుడు మాత్రం శిక్షించకుండా వదిలిపెట్టడుగా!
అందుకే గర్భంలో ప్రవేశపెడ్తున్నాడు శిశువుగా!
అదీ ఆడశిశువుగా!
ఆడ శిశువు అక్కరలేదు అనుకునేవాళ్ళు ఎక్కువైపోతున్నారు కనక గర్భంలోనే అంతం అయిపోతూ వస్తున్నాడు గత జన్మలో ఆడదాన్ని దారుణంగా అంతం చేసిన శ్రవణ్.
ఎన్నెన్నో గర్భాల్లో ప్రవేశిస్తున్నాడు. యమ యాతనని అనుభవిస్తున్నాడు.
అనుభవిస్తూ, అనుభవిస్తూ అంతమై పోతున్నాడు.
అన్ని హత్యలలోకీ దారుణమైన హత్య ఏమిటో గర్భంలో ఉన్న ఆ ఆత్మకి అర్ధమైంది.
గర్భంలో ఉన్న శిశువుని చంపడం దారుణమైన హత్య!
అది కోల్డ్ బ్లడెడ్ మర్డర్ అనుకుంది ఆత్మ.

* * *

ప్రాణం పోయవలసిన డాక్టర్ ప్రాణం తీసేందుకు కత్తులు, కటార్లతో తయారుగా ఉంది.
స్త్రీ జన్మకే అర్థం చెప్పే మాతృత్వాన్ని వదులుకోవడానికి సముద్ర బెడ్‌మీద సిద్ధంగా ఉంది.
నోట్ల కట్టలతో పుట్టబోయే ఆడశిశువును కదుక్కుందుకు బయట ఆకాశ్ సిద్ధంగా ఉన్నాడు.
మరో మాతృమూర్తి గర్భంలోకి ప్రయాణమై అక్కడకూడా నరకం కంటే దారుణంగా ఉండే బాధలను అనుభవించాలి ఇలాగే మరోసారి హత్యకు గురికావాలి కాబోలు అనుకుంది ఆత్మ.
కత్తి పన్లో పడింది. శిశువు ఆర్తనాదం చేసింది.
ఈ హత్యకీలోకంలో శిక్షలేదు.
ఈ రకమైన శిశువుల ఆర్తనాదాలు వినేంత విశాలమైన చెవులు ఈ లోకులకి లేవు.
మరో కోల్డ్ బ్లడెడ్ మర్డర్ జరిగిపోయింది.

**(అయిపోయింది)** *